# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 260 | హైదరాబాద్ | శుక్రవారం 10-04-2026 | పేజీలు : 12 | వెల : 1.00




హర్మూజ్ జలసంధి నుంచి వెనక్కి మరలుతున్న నౌకలు

11లో




11లో

## బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నా

- బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తే రాష్ట్ర భవిష్యత్తుకు పాటుపడవచ్చని వ్యాఖ్య
- శేషజీవితంలో కేసీఆర్‌తో కలిసి పనిచేసే అవకాశం వచ్చిందన్న జీవన్ రెడ్డి
- జీవన్ రెడ్డి నివాసానికి చేరుకుని పార్టీలోకి ఆహ్వానించిన కేటీఆర్ 11లో

## పవన్ ఖేరా అరెస్ట్‌పై ఉత్కంఠ...
## తీర్పు రిజర్వ్ చేసిన తెలంగాణ హైకోర్టు



- అసోం సీఎం భార్యపై ఆరోపణల కేసులో పవన్ ఖేరాకు అరెస్ట్ ముప్పు
- అరెస్ట్ నుంచి తాత్కాలిక రక్షణ కోరుతూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్
- ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, తీర్పు రిజర్వ్
- రేపు వెలువడనున్న తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ
- ఇది రాజకీయ కక్ష సాధింపేనని ఖేరా తరఫు న్యాయవాది వాదన 11లో

## హైదరాబాద్ శివార్లలో అగ్నికీలలు..
## రెండు చోట్ల భారీ ప్రమాదాలు

- హైదరాబాద్ శివార్లలో రెండు వేర్వేరు భారీ అగ్నిప్రమాదాలు
- జీడిమెట్ల సాల్వెంట్ గోదాంలో ఎగసిపడిన మంటలు
- బహదూర్‌పల్లి డెకరేషన్ గోదాంలో చెలరేగిన అగ్ని 11లో



## ఇల్లు, భూమి, కారు
## ఏదీ లేదు: మమతా

- నిన్న నామినేషన్ దాఖలు చేసిన మమతా బెనర్జీ
- రెండు బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు వెల్లడి 11లో
- రాయల్టీలు, బ్యాంకు వడ్డీలు ప్రాథమిక ఆదాయంగా వెల్లడి






## సౌదీ కీలక ఆయిల్ పైప్‌లైన్‌పై 11లో
## డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ దాడి

- అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత కొన్ని గంటల్లోనే ఘటన
- హర్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయ మార్గం కావడంతో పెరిగిన ఆందోళన
- అంతర్జాతీయ మార్కెట్లో మళ్లీ చమురు ధరలు పెరిగే అవకాశం

## బెంగాల్‌లో బీజేపీ అద్భుత విజయం సాధిస్తుంది

- ఐదేళ్ల క్రితం నాటి నందిగ్రామ్ ఫలితమే ఇప్పుడు బెంగాల్ అంతటా వస్తుందన్న మోదీ
- బెంగాల్ అభివృద్ధికి, చరిత్ర తిరగరాయడానికి ఉపయోగపడే ఎన్నికలు అన్న ప్రధాని
- బీజేపీ అధికారంలోకి రాగానే టీఎంసీ మోసాలు ప్రజల ముందు ఉంచుతామని వ్యాఖ్యలు 11లో



## భూ రికార్డులకు బ్రేక్..
## చంద్రబాబు కీలక ప్రకటన!



11లో

- సూరేపల్లిలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- 2027 మార్చి నాటికి 1.12 కోట్ల కొత్త పాస్‌పుస్తకాల పంపిణీ లక్ష్యం
- భూ రికార్డుల భద్రతకు బ్లాక్‌చైన్ టెక్నాలజీ, రికార్డ్ లాకింగ్ సిస్టమ్
- 22ఏ నిషేధిత జాబితా నుంచి 1.37 లక్షల ఎకరాల ఇనాం భూములకు విముక్తి
- ఆటో మ్యుటేషన్ తర్వాత పాస్‌బుక్‌ను నేరుగా లబ్ధిదారుని ఇంటికే పంపాలని ఆదేశం

## తీవ్ర ఉద్రిక్తతల నడుమ హర్మూజ్ దాటి
## భారత్ చేరుకున్న 'గ్రీన్ ఆశా'

- 15,400 టన్నుల ఎల్‌పీజీతో ముంబై పోర్టుకు చేరిన 'గ్రీన్ ఆశా' నౌక
- పశ్చిమాసియా ఉద్రిక్తతల తర్వాత జేఎన్‌పీఏకు చేరిన తొలి నౌక ఇదే
- హర్మూజ్ జలసంధిని దాటి సురక్షితంగా భారత్‌కు వచ్చిన ట్యాంకర్
- దేశ ఇంధన భద్రతకు ఇది కీలక మైలురాయి అని అధికారుల వెల్లడి

11లో



భారత శక్తి


# మతమా... విశ్వాసమా....

దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తున్న శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టులో కీలక విచారణ కొనసాగుతోంది.'శబరిమలలో స్త్రీల ప్రవేశం' అంశంపై జరుగుతున్న విచారణ సందర్భంగా బుధవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మతపరమైన ఆచారాల్లో ఏది మూఢనమ్మకమో, కాదో నిర్ణయించే అధికారం, హక్కు న్యాయస్థానానికి ఉందని పేర్కొంది.న్యాయమూర్తులు చట్టం విషయంలో మాత్రమే నిపుణులు, మత విషయాల్లో కాదు. కాబట్టి న్యాయస్థానాలు మత ఆచారాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేవు' అన్న కేంద్ర ప్రభుత్వ వాదనకు ప్రతిస్పందనగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసిందిసుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్? సూర్యకాంత్? నేతృత్వంలో, 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం శబరిమల కేసును విచారణ చేస్తోంది. ఈ ధర్మాసనంలో జస్టిస్? బి.వి. నాగరత్న, జస్టిస్? ఎం.ఎం. సుందరేశ్?, జస్టిస్? అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్? అరవింద్? కుమార్?, జస్టిస్? అగస్టిన్? జార్జ్? మాసిహ్?, జస్టిస్? ప్రసన్న బి.వరాలే, జస్టిస్? ఆర్? మహదేవన్?, జస్టిస్? జోయ్? మాల్య బాగ్చీ ఉన్నారు. ఈ బెంచ్ ఆధ్వర్యంలో కేరళలోని శబరిమల ఆలయంతో సహా, వివిధ మత ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై, అలాగే వివిధ మతాల్లో ఉన్న స్త్రీ మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరుగుతోంది కేరళలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల వేళ ఈ విచారణ రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ధర్మాసనంలో జస్టిస్‌లు బీవీ నాగరత్నం, ఎంఎం సుందరేష్, అహసానుద్దీన్ అమానుల్లా సహా తొమ్మిది మంది న్యాయమూర్తులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు బలంగా వినిపించారు. శబరిమల ఆలయానికి సంబంధించి మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలు పూర్తిగా మతపరమైన విశ్వాసాలకు సంబంధించినవని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 25వ అధికరణం కల్పించిన మత స్వేచ్ఛను ప్రస్తావిస్తూ మతపరమైన ఆచారాలు ప్రజలకు భావాలకు, నైతికత, ఆరోగ్యం, వంటి అంశాలకు భంగం కలిగించినప్పుడు మాత్రమే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాలని ఆయన వాదించారు. మతపరమైన గ్రంథాలను అర్థం చేసుకోవడం, అవి ఏవీ నిర్దేశిస్తున్నయో నిర్ణయించడం న్యాయసమీక్ష పరిధిలోకి రాదని, దీనికి ఆధ్యాత్మిక మతపరమైన ఆచారం అనేది నిర్ణయించడానికి న్యాయస్థానాలు ప్రయత్నించడం సరైనది కాదని ఆయన వాదించారు. కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్? మెహతా, "ఒక ఆచారం మూఢనమ్మకమని కోర్టు ఎలా నిర్ణయిస్తుంది? ఒక వేళ అది మూఢనమ్మకమని భావించినప్పటికీ, దానిని నిర్ధరించాల్సింది కోర్టు కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్? 25(2)(బి) ప్రకారం చట్టసభలు (లెజిస్లేచర్?)? మాత్రమే సంస్కరణ (రిఫార్మ్? లా) చట్టాలను తీసుకురావాల్సి ఉంటుంది. ఎలా అంటే, ఒక నిర్దిష్ట ఆచారం మూఢనమ్మకం అని, దానికి సంస్కరణ అవసరమని శాసనసభలు చెప్పవచ్చు. చేతబడి లాంటి ఆచారాలను నిరోధించడానికి ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు.2018 నాటి శబరిమల తీర్పులో మహిళల ప్రవేశానికి అస్పృశ్యత కిందకు వస్తుందని అప్పటి ధర్మాసనం చేసిన వ్యాఖ్యలపై తుషార్ మెహతా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై జస్టిస్ బీవీ నాగరత్న స్పందిస్తూ, ఒక మహిళను నెలలో మూడు రోజులు అంటరాని వ్యక్తిగా చూసి, నాలుగో రోజు ఆమె అస్పృశ్యురాలు కాదని చెప్పడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. అయితే మెహతా దీనికి సమాధానం ఇస్తూ శబరిమల విషయంలో ఆంక్షలు కేవలం వయసు ఆధారంగానే ఉన్నాయని, ఇది రుతక్రమంతో ముడిపడి లేదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని ఇతర అయ్యప్పస్వామి దేవాలయాల్లో ఇన్ని వయసుల మహిళలకు ప్రవేశం ఉందని, శబరిమల విషయంలో ఉన్న ఆంక్షలు ఒక ప్రత్యేక సందర్భం అని ఆయన వివరించారు. ఒక వేళ ఏదైనా అశాస్త్రీయమైన ఆచారం ఉంటే, దానిని పరిష్కరించే బాధ్యత శాసనసభలకే ఉంటుందని కేంద్రం వాదించింది. దీనిపై జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ, న్యాయస్థానాలు సైన్స్ రంగంలో నిపుణులు కాకపోయినప్పటికీ, ఎవిడెన్స్ యాక్ట్ ప్రకారం నిపుణులు అభిప్రాయాలను సమీక్షించే అధికారం కోర్టులకు ఉంటుందని పేర్కొన్నారు. ఒక సామాజిక రుగ్మతను మతపరమైన ఆచారంగా ముద్రవేసినప్పుడు అది నిజంగా మతపరమైన అచారామా లేక సామాజిక దురాచారమా అని చెప్పే హక్కు కోర్టుకు ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. భారతీయ సమాజం మహిళలను ఎప్పుడూ గౌరప్రదమైన స్థానంలో ఉంచిందని, మనం దేవతలను పూజిస్తామని మెహతా ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రపతి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వరకు మహిళలు అత్యున్నత పదవులను అలంకరించారని, కాబట్టి ఇక్కడ పితృస్వామ్య భావజాలాన్ని ఆపాదించవద్దని ఆయన కోరారు. 2018 సెప్టెంబర్?లో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 4:1 మెజారిటీతో శబరిమల ఆలయంలోకి 10 నుంచి 50 ఏళ్లలోపు మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. మహిళ ప్రవేశంపై నిషేధం ఉండడం రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొంది. ఆ తర్వాత 2019 నవంబర్? 14న అప్పటి సీజేఐ రంజన్? గొగోయ్? నేతృత్వంలోని ధర్మాసనం 3:2 మెజారిటీతో ఈ అంశాన్ని 9 మంది సభ్యులుగల అత్యున్నత ధర్మాసనానికి బదిలీ చేసింది.ఈ విచారణలో సుప్రీంకోర్టు కేవలం శబరిమల తీర్పు మెరిట్‌లను మాత్రమే కాకుండా, మతపరమైన స్థలాల్లో మహిళలపై వివక్షకు సంబంధించి రూపొందించిన ఏడు కీలక ప్రశ్నలపై దృష్టి సారిస్తామని స్పష్టం చేసింది.

# మామిడి రైతులపై యుద్ధ ప్రభావం

విజయవాడ, ఏప్రిల్ 9, (

భారత్‌లో మామిడి సీజన్ ప్రారంభమైందంటే ఎగుమతిదారులలో ఎంతో ఉత్సాహం కనిపిస్తుంది. కానీ, 2026 ఏప్రిల్ నెలలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పశ్చిమాసియాలో ముఖ్యంగా ఇరాన్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా భారతీయ మామిడి ఎగుమతులు ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మేలైన రకాలపై ఆల్ఫాన్సో, కేసర్, మన తెలుగు రాష్ట్రాల్లోప్రసిద్ధి చెందిన బంగినపల్లి వంటి రకాల ఎగుమతులకు ఈ యుద్ధం పెద్ద అడ్డంకిగా మారింది. రెండు నెలలుగా కొనసాగుతున్న యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించింది. దీనికి తోడు ఎర్ర సముద్రంలో నెలకొన్న అలజడుల వల్ల ప్రధాన షిప్పింగ్ లైన్లు తమ నౌకలను కేప్ ఆఫ్ గుడ్ హోప్ మీదుగా మళ్లించాల్సి వస్తోంది. ఈ మార్పు వల్ల ప్రయాణం కాలం విపరీతంగా పెరగడమే కాకుండా ఓడరేవుల్లో రద్దీ పెరిగి కంటైనర్లు సకాలంలో తిరిగి రావడం లేదు. మామిడి వంటి త్వరగా పాడైపోయే పండ్ల రవాణాకు రీఫర్ అని పిలిచే రిఫ్రిజిరేటెడ్ కంటైనర్లు అత్యవసరం. ఈ కంటైనర్లలో ఉష్ణోగ్రతను కచ్చితంగా 11 నుంచి 18 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంచాలి. భారత్ సొంతంగా ఈ రీఫర్ కంటైనర్లను తయారుచేయదు. మనం పూర్తిగా అంతర్జాతీయ షిప్పింగ్ లైన్లపైనే ఆధాపడుతున్నాం. యుద్ధం కారణంగా ఈ కంటైనర్ల రాకపోకలు మందగించడంతో ప్రస్తుతం మార్కెట్‌లో వీటి కొరత తీవ్రంగా ఉంది. యుద్ధం కారణంగా రవాణా రంగంపై పడిన ఆర్థిక భారం సామాన్యులనుగ్ర్భాంతికి గురి చేస్తోంది. గల్ఫ్ దేశాలకు వెళ్లే సముద్ర రవాణా ఛార్జీలు కొన్ని మార్గాల్లో ఏకంగా 8 రెట్లు పెరిగాయి. యుద్ధం ఉన్న ప్రాంతాల గుండా ప్రయాణించే నౌకలపై బీమా ఛార్జీలు, అదనపు పన్నులు భారీగా పెరిగాయి. కేవలం మార్చి నెలలోనే రీఫర్ కంటైనర్ల ఛార్జీలు వెయ్యి డాలర్లు వరకు పెరిగాయి. కొన్ని మార్గాల్లో సుమారు నాలుగువేల డాలర్ల వరకు అదనపు పన్నులు విధిస్తున్నారు. ఇది సాధారణ రవాణా ఖర్చు కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. ప్రపంచ మామిడి ఉత్పత్తిలో భారత్ అగ్రమగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా పండే మామిడిలో 44 శాతం అంటే సుమారు 20.68 మిలియన్ టన్నులు భారత్ నుంచే వస్తున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్ 56.5 మిలియన్ డాలర్ల విలువైన 29,938 టన్నుల తాజా మామిడి ఎగుమతి చేసింది. మన ఎగుమతుల్లో 40 శాతం నుంచి 45 శాతం వాటా గల్ఫ్ దేశాలదే. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉండే పీక్ సీజన్‌లో ఎగుమతిదారులకు ఇప్పటికే భారీ ఆర్డర్లు ఉన్నాయి. మామిడి పండు కోసిన తర్వాత కేవలం 28 రోజులు మాత్రమే నిల్వ ఉంటుంది. సముద్ర మార్గంలో ప్రయాణ కాలం పెరగడం వల్ల పండ్లు గమ్యస్థానానికి చేరే లోపే పాడైపోయే ప్రమాదం ఉంది. దీని వల్ల ఎగుమతిదారులు విమాన రవాణాను ఎంచుకోవాల్సి వస్తోంది. సముద్ర రవాణా ఖర్చు కేజీకి 50 నుంచి 80 రూపాయలు. విమాన రవాణా ఖర్చు కేజీకి 240 రూపాయల నుంచి 300 రూపాయలు. విమాన రవాణా దాదాపు



ఐదు నుంచి ఆరు రెట్లు ఖరీదైనదిగా కావడంతో ఎగుమతిదారుల లాభాలు తగ్గిపోతున్నాయు. ఈ సంక్షోభం కేవలం ఎగుమతిదారులకే పరిమితం కాలేదు. మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని రైతులకు కూడా ఇది పెద్ద దెబ్బ. ఎగుమతులు నిలిచిపోతే, ఆ నిల్వలన్నీ స్థానిక మార్కెట్‌కు మళుతాయి. దీని వల్ల దేశీయంగా మామిడి ధరలు భారీగా పడిపోయి రైతులకు కనీస పెట్టుబడి పోటీని ఎదుర్కోవడంలో కూడా భారత్ వెనుకబడే అవకాశం ఉంది.ఈ సమస్య కేవలం మామిడికే పరిమితం కాలేదు. అరటి, ద్రాక్ష, ఉల్లిపాయలు, సీ ఫుడ్ వంటి త్వరగా పాడైపోయే వస్తువులపై కూడా ఈ ప్రభావం పడింది. ముంబైలోని జీఎన్పీటీ ఓడరేవులో వందలాది కంటైనర్లు నిలిచిపోయాయి.

# అమరావతిలో మినీ ఢిల్లీ

విజయవాడ, ఏప్రిల్ 9, (

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. దీని కోసం రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేది తుది దశకు చేరుకుంది. ఢిల్లీలోని సెంట్రల్ వెస్టా తరహాలో, సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఈ అత్యాధునిక సచివాలయ సముదాయాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న సుమారు 50కి పైగా కేంద్ర ప్రభుత్వ విభాగాలు, అనుబంధ సంస్థలు ఈ నూతన భవనంలోకి మారనున్నాయి.ఈ ప్రాజెక్టును కేవలం కార్యాలయ భవనంగానే కాకుండా, పర్యావరణ హితమైన గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మించనున్నారు. ఐకానిక్ డిజైన్‌తో కూడిన ఈ భవన సముదాయంలో సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషనింగ్, అత్యాధునిక ఐటీ మౌలిక సదుపాయాలు, కాన్ఫరెన్స్ హాల్స్ , విశాలమైన పార్కింగ్ సౌకర్యాలు ఉండనున్నాయి. సుమారు 10 నుంచి 12 అంతస్తుల ఎత్తుతో నిర్మించనున్న ఈ భవనం, అమరావతి నగరానికే ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దీని ద్వారా పాలనలో వేగం పెరగడంతో పాటు, ప్రజలకు అన్ని కేంద్ర సేవలు ఒకే చోట లభించే వెసులుబాటు కలుగుతుంది.ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రజా పనుల శాఖ పర్యవేక్షించనుంది. ప్రాథమిక అంచనాల ప్రకారం, ఈ సముదాయం నిర్మాణానికి సుమారు రూ. మూడు వేల కోట్ల వరకు వ్యయం కావచ్చని భావిస్తున్నారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములను దీని కోసం వినియోగించుకోనున్నారు. కేంద్ర కేబినెట్ నుంచి తుది ఆమోదం లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించి, రాబోయే రెండేళ్లలోపు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర సచివాలయ నిర్మాణం వల్ల అమరావతి ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకోనున్నాయి. వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఒకే ప్రాంతానికి రావడం వల్ల స్థిరాస్తి రంగానికి ఊతం లభించడమే కాకుండా, స్థానికంగా సేవా రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అమరావతిని కేవలం ఒక పరిపాలనా కేంద్రంగానే కాకుండా, జాతీయ స్థాయిలో ఒక కీలకమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఈ ప్రాజెక్టు మైలురాయిగా నిలవనుంది.

ప్రాజెక్టు అంచనా వ్యయం:

సెంట్రల్ సెక్రటేరియట్: రూ.1,299.08 కోట్లు.

ఉద్యోగుల నివాస సముదాయాలు: రూ.1,234.91 కోట్లు.

నిర్మాణ విస్తీర్ణం:

ఈ భారీ ప్రాజెక్టు కోసం ఏపీ సీఆర్‌డీఏ ఇప్పటికే 22.53 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో 5.53 ఎకరాల్లో సచివాలయ భవనం, మిగిలిన 17 ఎకరాల్లో కేంద్ర ఉద్యోగుల కోసం బహుళ అంతస్తుల నివాస భవనాలను నిర్మించనున్నారు. కేంద్ర గృహ నిర్మాణ శాఖ పంపిన ఈ ప్రతిపాదనలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే ఆమోదం తెలిపారు.

ప్రముఖుల చొరవ:

ఈ ప్రాజెక్టు త్వరగా పట్టాలెక్కేలా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నిరంతరం అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పర్యవేక్షించారు. మరోవైపు, ఇదే ప్రాంతంలో మరో 10 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మిస్తామని హుడ్‌కోవెల్లడించింది. దీనివల్ల అమరావతిలో జాతీయ, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణకు మార్గం సుగమం కానుంది.

# వైసీపీకి ముందున్న సవాళ్లు..వ్యూహాలే కీలకం..

ఒంగోలు, ఏప్రిల్ 9,

గత ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటుస్థానం నుంచి పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఓటమి పాలవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఆయనకు ఆ ప్రాంతంతో ప్రత్యక్ష అనుబంధం లేకపోయినా, పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ పోటీకి దిగారు. చిత్తూరు జిల్లా ముఖ్యంగా చంద్రగిరి నియోజకవర్గం నుంచి వచ్చిన ఆయనను ఒంగోలు ప్రజలు పూర్తిగా అంగీకరించలేకపోయారని విశ్లేషణలు సూచిస్తున్నాయి. స్థానికంగా బలమైన ఓటు బ్యాంక్ ఉన్నప్పటికీ, అది విజయం సాధించేందుకు సరిపోలేదు.ఇదే సమయంలో వైసీపీ నుంచి టీడీపీలోకి మారిన మాగుంట శ్రీనివాసులు రెడ్డి విజయం సాధించడం కీలక అంశంగా మారింది. ఆయనకు స్థానిక పరిచయం, ప్రజలతో అనుబంధం ఉండటం కూడా విజయానికి కారణమయ్యాయి. ఎన్నికల్లో కేవలం సామాజిక వర్గాల లెక్కలు సరిపోవు, ప్రజల మనస్తత్వం కూడా అర్థం చేసుకోవాలి అన్న విషయం ఇక్కడ స్పష్టమైంది.ఇలాంటి పరిస్థితులు మరికొన్ని చోట్ల కూడా కనిపించాయి. నెల్లూరు సిటీ నుంచి గుంటూరు జిల్లా నరసరావుపేట కు అనిల్ కుమార్ ను పంపించడం కూడా అప్పట్లో చర్చనీయాంశమైంది. స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా తీసుకున్న ఈ తరహా నిర్ణయాలు పార్టీకి ప్రతికూలంగా మారాయని కొందరు భావిస్తున్నారు. నాయకుల వ్యక్తిగత ఇమేజ్‌పై మాత్రమే ఆధారపడటం సరిపోదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

======================

# పవర్ ఫుల్ ఉమెన్ నుంచి జైలు గోడలవరకు... కళింగిరి శాంతి ప్రస్థానం

కాకినాడ, ఏప్రిల్ 9, (

దేవాదాయ శాఖలో అత్యంత వివాదాస్పద అధికారిగా పేరుపొందిన అసిస్టెంట్ కమిషనర్ కళింగరి శాంతి ఉదంతం, అధికార బలం ఉంటే వ్యవస్థలను ఎలా శాసించవచ్చో చెప్పడానికి ఒక ఉదాహరణగా నిలుస్తుంది. కేవలం ఆరేళ్ల సర్వీసులో, అందులోనూ రెండేళ్ల సస్పెన్షన్ కాలం పోను, కేవలం నాలుగేళ్లలోనే ఆమె సృష్టించిన ప్రకంపనలు అన్నీ ఇన్నీ కావు. తాజాగా ఏసీబీ దాడుల్లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయ్యి, 14 రోజుల రిమాండ్‌కు వెళ్లడంతో ఆమె అప్రతిహత ప్రస్థానానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది.2020లో దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా చేరిన కళింగరి శాంతికి, అప్పటి అధికార పార్టీలో కీలక నేతగా ఉన్న విజయసాయి రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఆ రాజకీయ అండతో ఆమె అటు ఉద్యోగ పరంగా, ఇటు వ్యక్తిగత జీవితంలోనూ తీవ్ర వివాదాలకు కేంద్రబిందువైంది. భర్త మదన్ మోహన్‌తో విడాకులు తీసుకోకుండానే మరొకరితో సహజీవనం చేయడం, ఒక బిడ్డకు జన్మనివ్వడం వంటి అంశాలు అప్పట్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఆ బిడ్డ తండ్రి ఎవరనే విషయంలో భర్త మదన్ మోహన్ చేసిన ఆరోపణలు, విజయసాయి రెడ్డికి డీఎన్ఏ పరీక్షలు చేయాలన్న డిమాండ్లు అప్పట్లో సంచలనం సృష్టించాయి.శాంతి అధికార దర్పం ఏ స్థాయిలో ఉండేదంటే, విశాఖపట్నంలో పనిచేస్తున్న సమయంలో తన పై అధికారి అయిన డెప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్ గదిలోకి చొరబడి ఆయనపై ఇసుక చల్లడం ఆమె బరితెగింపునకు పరాకాష్ట. ఒక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినందుకు నిరసనగా ఆమె ఈ చర్యకు పాల్పడటం గమనార్హం.ఈ ఘటన సీసీటీవీలో రికార్డ్ అయినప్పటికీ, విచారణాధికారి తప్పు పట్టినప్పటికీ, ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకోకుండా, ఫిర్యాదు చేసిన పై అధికారిని బదిలీ చేయడం వ్యవస్థల నిర్వీర్యానికి నిదర్శనం. దీంతో మనస్తాపం చెందిన డెప్యూటీ కమిషనర్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.విశాఖలో పని చేస్తున్న సమయంలో 'ప్రేమ సమాజం' భూములు, ఇతర దేవాదాయ భూముల లీజుల వ్యవహారంలో ఆమెపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆమెను సస్పెండ్ చేసినప్పటికీ, రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఆమెను డిస్మిస్ చేసే ఫైల్ ముందుకు కదలలేదనే విమర్శలు ఉన్నాయి. కోర్టు ఆదేశాలతో మార్చి చివరి వారంలో తిరిగి పోస్టింగ్ పొందిన శాంతి, పది రోజులు గడవకముందే ఏసీబీ వలలో చిక్కుకుంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే అభియోగంపై ఏసీబీ ఆమెను అరెస్ట్ చేసి జైలుకు పంపింది.శాంతి ఉదంతం రెండు ముఖ్యమైన పాఠాలను నేర్పుతుంది. రాజకీయ నాయకుల మద్దతు ఉంటే చట్టాన్ని, నిబంధనలను అతిక్రమించవచ్చనే ధీమా అధికారులను ఎంతటి పతనానికి తీసుకెళ్తుందో శాంతి జీవితం ఒక హెచ్చరిక. ఒక జూనియర్ అధికారి ఇంతగా రెచ్చిపోతున్నా.. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఆమె విషయంలో నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయి. కోర్టు ఆదేశాలు ఇచ్చే వరకు లేదా ఏసీబీ దాడులు జరిగే వరకు వేచి చూడటం వ్యవస్థల బలహీనతను సూచిస్తుంది.మొత్తానికి, దేవాదాయ శాఖలో పవర్ ఫుల్ వుమెన్ గా చలామణీ అయిన కళింగరి శాంతి ప్రస్థానం ప్రస్తుతం జైలు ఊచల వెనక్కి చేరింది. అధికార గర్వం, అవినీతి వెరసి ఒక అధికారి జీవితాన్ని ఎలా అగాధంలోకి నెట్టేస్తాయో చెప్పడానికి ఈ స్టోరీ ఒక సాక్ష్యం.

# కులరాజకీయాలు....పెరుగుతున్న ఒత్తిడి

నెల్లూరు, ఏప్రిల్ 9

రాష్ట్ర రాజకీయాల్లో సామాజిక వర్గాల ప్రభావం రోజు రోజుకు పెరుగుతోంది. ఒకప్పుడు పార్టీల అంతర్గత వ్యవహారాలుగా ఉన్న కుల ఆధారిత నిర్ణయాలు ఇప్పుడు బహిరంగ చర్చలకు వస్తున్నాయి. ప్రజలు కూడా తమ వర్గాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారు, ఏ మేరకు అవకాశాలు కల్పిస్తున్నారు అనే విషయాలను నేరుగా ప్రశ్నించే స్థాయికి వచ్చారు. ఇది రాజకీయ వ్యవస్థలో ఒక పెద్ద మార్పుగా భావించవచ్చు.ఇప్పటి వరకు రాజకీయ పార్టీలు టికెట్ల కేటాయింపులో సామాజిక సమీకరణాలను పరిగణలోకి తీసుకున్నప్పటికీ, అది ఎక్కువగా పార్టీ లోపలే పరిమితమయ్యేది. సమాజంలో ఉన్న పరిస్థితులను బట్టి కొన్ని వర్గాలకు ఎక్కువ అవకాశాలు, మరికొన్ని వర్గాలకు తక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతూ వచ్చేది. అయితే, ఈ అసమానతలను చాలా వర్గాలు సహజంగా అంగీకరించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారుతోంది.ఉమ్మడి అనంతపురం జిల్లాలో బోయ సమాజం పెద్ద సంఖ్యలో ఉంది. ఈ వర్గం చాలా కాలంగా ఎస్టీ హోదా కోసం డిమాండ్ చేస్తోంది. అదే విధంగా చిత్తూరు జిల్లాలో రెల్లి సమాజం గణనీయంగా ఉంది. వీరు వ్యవసాయం, సంప్రదాయ వృత్తులతో జీవనం సాగిస్తూ ఉన్నప్పటికీ, రాజకీయంగా తగిన గుర్తింపు లేదని భావిస్తున్నారు.ఇక ఉమ్మడి కృష్ణా జిల్లా లో వైశ్య వర్గం కూడా ఇప్పుడు రాజకీయంగా చైతన్యం పొందుతోంది. తమకు తగిన ప్రాతినిధ్యం లేదని భావిస్తూ వారు కూడా తమ డిమాండ్లను బలంగా వినిపిస్తున్నారు. తూర్పు గోదావరి,పశ్చిమ గోదావరి జిల్లాల్లో కేవలం కాపు వర్గం మాత్రమే కాకుండా, ఇతర సామాజిక వర్గాలు కూడా గణనీయంగా ఉన్నాయనే విషయం స్పష్టంగా కనిపిస్తోంది.ఇలా ప్రతి జిల్లాలోనూ కొన్ని వర్గాలు తమకు సరైన అవకాశాలు లభించడం లేదని భావిస్తున్నాయి. ఇప్పటి వరకు నియోజకవర్గాల సంఖ్య పరిమితంగా ఉండటం, పోటీ తీవ్రంగా ఉండటంతో ఈ అసంతృప్తి అంతగా బయటకు రాలేదు. కానీ పరిస్థితులు మారుతున్నాయి. త్వరలో జరిగే నియోజకవర్గాల పునర్విభజన కారణంగా సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రతి వర్గం తమకు ఎక్కువ ప్రాధాన్యం కావాలని కోరుతోంది.ముఖ్యంగా మండలాలు, పట్టణ స్థాయిలో నాయకత్వం వహిస్తున్న సామాజిక వర్గాల నేతలు ఈ డిమాండ్లను ముందుకు తెస్తున్నారు. ఇది క్రమంగా రాష్ట్ర స్థాయిలో పెద్ద చర్చగా మారుతోంది. అన్ని రాజకీయ పార్టీలపై ఈ ఒత్తిడి పెరుగుతోంది. ప్రతి వర్గాన్ని సంతృప్తి పరచాల్సిన అవసరం ఏర్పడుతోంది.ఈ పరిస్థితుల్లో టికెట్ల కేటాయింపు ప్రక్రియ పార్టీలకు పెద్ద సవాల్‌గా మారే అవకాశం ఉంది. సమతుల్యత పాటించకపోతే అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. అందుకే ఈసారి ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక నిజంగా కత్తిమీద సాములా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# తిరుపతిలో 10 అంతస్తుల్లో బస్ స్టాండ్

తిరుపతి, ఏప్రిల్ 9

తిరుపతికి శ్రీవారి దర్శనం కోసం నిత్యం భారీగా భక్తులు తరలివస్తుంటారు. ఈ మేకు భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు నగరంలో ప్రస్తుతం ఉన్న బస్టాండ్ స్థానంలో ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు రూ.470 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణాన్ని ఈపీసీ విధానంలో నిర్మించాలని అధికారులు నివేదికను పంపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతిలో మౌలిక వసతుల్ని మరింత మెరుగుపరిచేందుకు సిద్ధమైంది. తిరుమల శ్రీవారి దర్శనం కోసం నిత్యం వేలాదిమంది భక్తులు తిరుపతికి వస్తుంటారు. ఈ క్రమంలో తిరుపతిలో మరిన్ని మౌలిక వసుతల్ని కల్పించే దిశగా ప్రణాళిక రూపొందించింది. తిరుపతిలో ప్రస్తుతం ఉన్న మెయిన్ బస్టాండ్ స్థానంలో కొత్తగా ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ నిర్మించాలని నిర్ణయం తీసుకోగా.. తాజాగా దీనికి సంబంధించి కీలక ముందడుగు వేసింది. తిరుపతి ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్‌కు ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో నిర్మించాలని తేల్చారు.తిరుపతిలో ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీకి చెందిన బస్టాండ్ స్థలంలో.. ఎన్‌హెచ్‌ఎల్‌ఎంఎల్ (నేషనల్






హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్) బస్ టెర్మినల్‌ను రూ.470 కోట్ల అంచనాతో ప్లాన్ చేశారు. ఈ టెర్మినల్ నిర్మాణానికి సంబంధించి మూడు విధానాలను (బీవోటీ, హామ్, ఈపీసీ) అధ్యయనం చేశారు. వాటిలో ఈపీసీ బావుంటుందని ప్రభుత్వానికి ప్రతిపాదనల్ని కూడా పంపారు. తిరుపతి బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్, తిరుమల, ఆ చుట్టుపక్కల ఉన్న ఆలయాలకు వెళ్లే భక్తులకు ఈ టెర్మినల్ కీలకంగా మారింది.. అందుకే దీనికి ఇంటర్ మోడల్‌గా పేరు పెట్టారు. ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ డీపీఆర్ తయారు చేసేందుకు రైట్స్ (రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ లిమిటెడ్)ను సలహా సంస్థగా నియమించారు.ప్రస్తుతం ఉన్న తిరుపతి బస్టాండ్, డిపో కలిపి మొత్తం 13.18 ఎకరాల్లో ఉంది. ఇందులో 7.11 ఎకరాల్లో ఈ బస్ టెర్మినల్ ప్లాన్ చేశారు. రోడ్డు పక్కన ఉన్న 4.29 ఎకరాలను కమర్షియల్‌గా అభివృద్ధి చేయనున్నారు.99 సెంట్ల భూమిని రోడ్డు కోసం, 79 సెంట్ల భూవిని ఫ్లై ఓవర్ కోసం నిర్మించనున్నారు. బస్ టెర్మినల్‌లో పార్కింగ్ కోసం సెల్లార్‌లో రెండు అంతస్తులు ప్లాన్ చేశారు. ఇలా ఆయ సదుపాయాల కోసం భూమిని కేటాయించారు. ప్రస్తుత ప్లాన్ ప్రకారం గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం టెర్మినల్‌కు కేటాయిస్తారు. మొత్తం 98 ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం.. టెర్మినల్ ప్రాంగణంలో మరో 50 బస్సులు నిలిపేందుకు వీలుగా స్థలం కేటాయించనున్నారు.టెర్మినల్ గ్రౌండ్ ఫ్లోర్ పైన 10 అంతస్తులు నిర్మించి కమర్షియల్ (హోటళ్లు, రెస్టారెంట్లు, డార్మెటరీలకు, మిగిలిన షాపులకు) కేటాయిస్తారు. అంతేకాదు టెర్మినల్‌లోని పదో ఫ్లోర్‌లో హెలీప్యాడ్ నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ టెర్మినల్ నుంచి బస్టాండ్, రైల్వే స్టేషన్‌ను కనెక్ట్ చేసేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇటీవల అధికారులు ఈ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నవారితో అధికారులు మాట్లాడారు.. వారి నుంచి అభిప్రాయాలసేకరించి పభుత్వానికి నివేదిక పంపించనున్నారు. కమర్షియల్‌గా కేటాయించబోయే వాటితో లాభాల పరిస్థితి.. ఆర్టీసీకి ఎంత ఇస్తారు, ఒప్పందం ఎన్నేళ్లు అనే అంశాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ను మరో చోటికి తరలిస్తే 5 ఎకరాల భూమి, డిపో కోసం మరో ఐదు ఎకరాలు తాత్కాలికంగా కేటాయించాలని ఆర్టీసీ జిల్లా కలెక్టర్‌ను కోరింది.

# కర్నూలులోనే మూడు ప్రధానా కార్యాలయాలు

కర్నూలు, ఏప్రిల్ 9,

కర్నూలులోని రాష్ట్ర వక్ఫ్ ట్రైబ్యునల్ అమరావతికి తరలించాలని దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టేసింది. వక్ఫ్ ట్రైబ్యునల్‌ను అమరావతిలో కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కోర్టుకు లాయర్ తెలిపారు. మరోవైపు లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలను కూడా కర్నూలులోనే కొనసాగిస్తామని ప్రభుత్వం తెలిపింది. 2021లో కార్యాలయాల తరలింపు పిల్‌లు దాఖలయ్యాయి. తాజాగా ప్రభుత్వ క్లారిటీ ఇవ్వడంతో ఈ మూడు ముఖ్యమైన కార్యాలయాలు కర్నూలులోనే కొనసాగనున్నాయి.కర్నూలులోనే వక్ఫ్ ట్రైబ్యునల్, లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ) కార్యాలయాలు కొనసాగుతాయని ఏపీ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. ఏపీ హైకోర్టులో రాష్ట్ర వక్ఫ్ ట్రైబ్యునల్ తరలింపుపై పిల్ దాఖలైంది.. కర్నూలలో ఉన్న వక్ఫ్ ట్రైబ్యునల్‌ను అమరావతికి తరలించేలా ఆదేశాలు ఇవ్వాలని 2021లో సామాజిక కార్యకర్త మహ్మద్ ఫరూఖ్ షిబ్లి హైకోర్టును కోరారు. ట్రైబ్యునల్ మినహా వక్ఫ్‌బోర్డు, తదితర మైనారిటీ సంస్థలన్నీ విజయవాడలో ఉన్నాయని పిటిషనర్ తరఫు లాయర్ కోర్టులో వాదనలు వినిపించారుపరిపాలనా సౌలభ్యం కోసం ట్రైబ్యునల్‌ను అమరావతికి తరలించాలని పిటిషనర్ తరఫు లాయర్ కోరారు. వక్ఫ్ సంస్థలు, ఆస్తులు, వివాదాలకు సంబంధించిన ఎక్కువ కేసులు కర్నూలుతో పాటుగా చుట్టుపక్కల జిల్లాల్లో ఉన్నాయని ప్రభుత్వం తరఫున లాయర్ వాదించారు. హైకోర్టు కూడా వక్ఫ్ ట్రైబ్యునల్ కర్నూలులో ఉండటంలో న్యాయం ఉందని అభిప్రాయపడింది.. ఈ మేరకు షిబ్లీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం కొట్టేసింది.అంతేకాదు కర్నూలు నుంచి అమరావతికి హెచ్‌ఆర్సీ, లోకాయుక్తలను తరలించాలని 2021లో హైకోర్టులో పిల్‌లు దాఖలయ్యాయి. ఈ క్రమంలో తాజాగా కర్నూలులో ఉన్న మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ), లోకాయుక్త అంశంపై ఏపీ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు కార్యాలయాలను కర్నూలులోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తరఫున లాయర్ కోర్టుకు తెలిపారు. మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ)లో ఏపీ, తెలంగాణ మధ్య సిబ్బంది విషయమై విభజన జరగాల్సి ఉందన్నారు.ఇటు లోకాయుక్తను కూడా త్వరలో నియమిస్తామని తెలిపారు. ప్రభుత్వ తరఫు లాయర్ కోర్టుకు తెలిపిన వివరాలను పరిగణనలోకి తీసుకుని విచారణను వాయిదా వేసింది. గత ప్రభుత్వ హయాంలో లోకాయుక్త, హెచ్‌ఆర్సీ కార్యాలయాలను కర్నూలుకు తరలించారు. అయితే ఈ రెండు కార్యాలయాలను అమరావతికి తరలించాలని హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యాలు దాఖలయ్యాయి.. వాటిపై హైకోర్టు విచారణ చేస్తోంది. అంతేకాదు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశం కూడా తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే.

# దళపతికి దారేది...

చెన్నై, ఏప్రిల్ 9,

తమిళ సినీ స్టార్ విజయ్ తన రాజకీయ ప్రయాణంలో సామాన్యులకే పీఠం అనే నినాదంతో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే ఎన్నికల కోసం ఆయన ఎక్కువగా అభిమానులకు, సామాన్య కార్యకర్తలకు టిక్కెట్లు కేటాయించారు. అయితే, ఆచరణలోకి వచ్చేసరికి ఈ నిర్ణయం పార్టీకి పెను సవాలుగా మారింది. ఎన్నికల నిర్వహణలో తలపండిన డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి దిగ్గజ పార్టీల ఒత్తిడికి తలొగ్గుతున్నారు. బరి నుంచి వైదొలుగుతున్నారు. విజయ్ పార్టీకి చెందిన అభ్యర్థుల్ని బరి నుంచి తప్పించేందుకు డీఎంకే, అన్నాడీఎంకే కూటములు గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. నామినేషన్ల సమయం ముగియడంతో తమ ప్లాన్ అమలు చేస్తున్నారు. తాజాగా ఎడప్పాడి నుంచి టీవీకే అభ్యర్థి వైదొలిగారు. అలాగే సుమారు 20కి పైగా స్థానాల్లో అభ్యర్థులు బరి నుండి తప్పించే ప్రణాళికల్ని అమలు చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల వ్యూహాలను తట్టుకోలేకనో లేదా ఎన్నికల ఖర్చును భరించలేకనో వారు వెనకడుగు వేస్తుండటం విజయ్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. ఒకవేళ నామినేషన్ల పర్వం ముగిశాక అభ్యర్థులు సైలెంట్ అయిపోయినా లేదా పోటీ నుండి తప్పుకున్నా, అది కొత్తగా పుట్టిన టీవీకే పార్టీ పరువును బజారున పడేస్తుందని ఆ పార్టీ అంతర్గత వర్గాలు భయపడుతున్నాయి.విజయ్ పార్టీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య బలమైన అభ్యర్థుల కొరత . క్షేత్రస్థాయిలో ఓటర్లను ప్రభావితం చేయగల పేరున్న నేతలు లేకపోవడం పార్టీకి మైనస్‌గా మారుతోంది. తమిళనాడులో ద్రవిడ ముద్ర బలంగా ఉన్న నేపథ్యంలో, కేవలం విజయ్ ఇమేజ్ మాత్రమే అభ్యర్థులను గట్టెక్కిస్తుందా అన్నది అనుమానమే. బలమైన నేతలు లేని పక్షంలో ఓట్ల చీలిక జరిగి, అది పరోక్షంగా అధికార పార్టీకే లాభం చేకూరుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. తమిళనాడులో విజయ్ రాజకీయ పరిపక్వతపై ఇప్పటికే సెటైర్లు వేస్తున్నాయి. పార్టీ పెట్టడం సులభం.. కానీ బరిలో నిలబెట్టడం కష్టం అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. అభ్యర్థులు ఉపసంహరించుకుంటే ఆ ప్రభావం విజయ్ భవిష్యత్తు రాజకీయాలపై తీవ్రంగా పడుతుందిఈ క్రమంలోనే విజయ్ తన కోర్ టీమ్‌తో అత్యవసర సమావేశాలు నిర్వహిస్తున్నారని, అభ్యర్థులకు అవసరమైన ఆర్థిక, నైతిక మద్దతును ఎలా అందించాలనే దానిపై కసరత్తు చేస్తున్నారని సమాచారం. వెండితెరపై వందల కోట్లు కొల్లగొట్టిన దళపతికి, రాజకీయ క్షేత్రంలో అభ్యర్థుల ఎంపికే మొదటి పెద్ద అడ్డంకిగా మారింది. ఈ గండాన్ని విజయ్ ఎలా అధిగమిస్తారనే దానిపైనే తమిళగ వెట్రి కళగం భవిష్యత్తు ఆధారపడి ఉంది. సీనియర్ నేతలను చేర్చుకోకుండా కేవలం అభిమానులపైనే భారం వేయడం సాహసమా లేక అనాలోచిత నిర్ణయమా అనేది కాలమే నిర్ణయించాలి.

# కవిత, షర్మిలకు బంగారం వంటి అవకాశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 9, (న్యూస పల్స్)

రాజకీయాల్లో అవకాశాలు రావాలి. కాలం కలిసొస్తే మంత్రి పదవి కూడా చేపట్టకుండా కనీసం ఎమ్మెల్యే కూడా కాకుండా ముఖ్యమంత్రి అయిపోవచ్చు. ఎంపీ కాకుండానే ప్రధాని పదవిలో కూర్చోవచ్చు. ఇవన్నీ ఈ దేశంలో జరిగాయి. ఇక తెలుగు రాజకీయాల్లో చూస్తే ఇప్పటిదాకా పురుషాధిపత్యం సాగుతోంది. మహిళా రాజకీయ నాయకురాళ్ళు ఉన్నారు కానీ వారు ద్వితీయ స్థానాలకే పరిమితం అవుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు ప్రముఖ రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వైఎస్ షర్మిల, కల్వకుంట్ల కవిత ఇద్దరూ తమ రాజకీయ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.ఈ ఇద్దరూ సొంత కుటుంబాలను వ్యతిరేకిస్తూ సొంత రాజకీయం చేస్తున్నారు. ఇందులో షర్మిల అయితే తెలంగాణాలో వైఎస్సార్ టీపీని స్థాపించి కొన్నాళ్ళు అక్కడ రాజకీయం చేశారు. చివరికి ఆ పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసి 2024 ఎన్నికల ముందు ఏపీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అయ్యారు. ఆమె తానుగా గెలవకపోయినా వైసీపీని ఓడించారు. దాంతో పాటు వైసీపీకి రాయలసీమలో పెద్ద దెబ్బ తగిలి ఏకంగా విపక్ష స్థానానికి సైతం సరిపడా సీట్లు దక్కకుండా 11 సీట్లకే పరిమితమై చతికిలపడింది. ఇక ఏపీ కాంగ్రెస్ కి ఆమె ప్రెసిడెంట్ గా తనదైన శైలిలో పనిచేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ఓటు బ్యాంక్ అంతా కాంగ్రెస్ దే కావడం దాని అధినేత





జగన్ కావడంతో వైఎస్సార్ వారసురాలిగా షర్మిలను పీసీసీ పీఠం మీద ఉంచితే ఎంతో కొంత కాంగ్రెస్ కి ఓటు బ్యాంక్ దక్కుతుందన్న ఆలోచనలో కాంగ్రెస్ పెద్దలు జాతీయ స్థాయిలో ఆలోచిస్తున్నారు అని అంటున్నారు.ఈ క్రమంలో ఏపీలో అదనంగా మరో యాభై శాతం సీట్లు పెరుగుతాయని అంటున్నారు. అంతే కాదు మొత్తం సీట్లలో మూడవ వంతు మహిళలకు రిజర్వేషన్ అంటున్నారు. అంటే ఏపీలో 263 సీట్లు పెరిగితే అందులో 88 సీట్ల దాకా విమెన్ రిజర్వేషన్ కిందకు వస్తుంది. ఈ సీట్లలో పోటీ చేయడానికి మహిళా నాయకురాళ్ళు రెడీగా ఉండాల్సిందే. ఇప్పటికే కీలకమైన స్థానాల్లో ఉన్న వారికి ఈ సీట్ల పెరుగుదల రిజర్వేషన్లు అన్నవి అతి పెద్ద బూస్టింగ్ గా అని చెబుతున్నారు. మరీ ముఖ్యంగా కడప జిల్లాలో పది సీట్లు పదిహేను అవుతాయని అంటున్నారు. అయిదు సీట్లు మహిళలకు దక్కుతాయి. కడప అంటే వైఎస్సార్ ఫ్యామిలీకి కంచుకోట. 2024 లో కడప ఎంపీ సీటుకు షర్మిల పోటీ చేశారు. లక్షన్నర ఓట్లు తెచ్చుకున్నారు. ఇపుడు పెద్ద నియోజకవర్గాలు చిన్నవిగా మారితే మహిళా రిజర్వేషన్లు అయితే షర్మిలకు కుటుంబ నేపథ్యం, రాజకీయంగా పరిస్థితులు అనుకూలించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఆమె మీద బలమైన అభ్యర్థులను ప్రత్యర్థులు వెతకాల్సి ఉంటుంది. లేకపోతే స్టేట్ వైడ్ లీడర్ గా ఉన్న షర్మిల జాగ్రత్తగా చేసుకుంటే గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టడం కష్టం కాబోదు అని అంటున్నారు. కవిత తెలంగాణాలో కొత్త పార్టీని స్థాపించబోతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో కొత్తగా సీట్లు పెరగడం చిన్న అసెంబ్లీ నియోజకవర్గాలుగా మారడం కలిసి వచ్చే అంశమే అంటున్నారు. అక్కడ కూడా 59 దాకా సీట్లు మహిళా రిజర్వేషన్ల రూపంలో దక్కనున్నాయి. కవిత జనంలో ఉంటున్నారు తండ్రి కేసీఆర్ మాదిరిగానే ఫైర్ బ్రాండ్ గా ఉంటున్నారు. దాంతో ఆమె తనతో పాటు కొందరు మహిళా నేతలను కనుక జాగ్రత్తాగ ఎంపిక చేసుకుంటే రిజర్వ్ సీట్లలో గెలుచుకోగలరని అంటున్నారు. అలాగే ఇమేజ్ ఉన్న నాయకులు ఆమె పార్టీలో చేరితే చతుర్ముఖ పోరులో చిన్న నియోజకవర్గాల్లో ఓట్లు అటు నుంచి ఇటు అయితే గెలిచే వీలు ఉంటుందని లెక్క వేస్తున్నారు. మొత్తానికి కవిత పార్టీకి ఇది శుభారంభం అని అంటున్నారు. ఏది ఏమైనా మహిళా రాజకీయ నాయకురాళ్ళుగా పట్టుదలగా పోరాడుతున్న కవిత షర్మిల రాజకీయ జాతకాన్ని మార్చే విధంగా పునర్ విభజన కానీ మహిళా రిజర్వేషన్ కానీ ఉండబోతున్నాయా అంటే వేచి చూడాల్సిందే అంటున్నారు.

# హిట్ లిస్ట్ లో మరో ఎమ్మెల్యే

విజయవాడ, ఏప్రిల్ 9,

ముఖ్యమంత్రి చంద్రబాబు హిట్ లిస్టులో మరో ఎమ్మెల్యే చేరారు. తొలిసారిగా ఎమ్మెల్యే అయిన ఆ నేత తన దుందుడుకు ప్రవర్తనతో పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారని సీఎం చంద్రబాబుకు ఫిర్యాదులు వస్తున్నాయని అంటున్నారు. ఇటీవల ఓ మీడియా ప్రతినిధితో దురుసుగా మాట్లాడటమే కాకుండా ఫోన్ లో అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఆ ఎమ్మెల్యేపై పార్టీ అధిష్టానం సీరియస్ గా ఉన్నట్లు చెబుతున్నారు. ఇక తాజాగా ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన జిల్లా ఎమ్మెల్యేల సమావేశంలో ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన సీఎం చంద్రబాబు పద్ధతి మార్చుకోకపోతే పక్కకు తప్పిస్తానంటూ స్ట్రైట్ వార్నింగ్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యే మామిడ గోవిందరావు పద్ధతి సరిగా లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఉండవిల్లిలోని సీఎం నివాసంలో జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్ష సమావేశం జరిగింది. ఒక్కో నియోజకవర్గంలో పరిస్థితులపై చర్చించిన ముఖ్యమంత్రి చంద్రబాబు పాతపట్నం విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని అంటున్నారు. తొలిసారి గెలిచిన ఎమ్మెల్యే కేవలం 21 నెలల్లోనే అనేక వివాదాల్లో చిక్కుకుంటున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారని చెబుతున్నారు. ? “ నీ వ్యవహారశైలిపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. పాతపట్నం మొదటి నుంచీ టీడీపీకి బలమైన నియోజకవర్గం. అక్కడ వైసీపీ ఇన్‌ఛార్జి కూడా బలంగా లేరు. నీ ప్రవర్తన వల్ల పార్టీకి నష్టం జరిగే పరిస్థితి కనిపిస్తోంది. ప్రవర్తన, మాటతీరు మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవు” అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారని అంటున్నారు. సహచర ఎమ్మెల్యేల సమక్షంలోనే సీఎం ఇలా చీవాట్లు పెట్టడంతో ఎమ్మెల్యే గోవిందరావు తెల్లముఖం వేశారని అంటున్నారు. .రామ్మోహన్ మెరుపులు పార్టీకి ఇబ్బంది కలిగేలా ప్రవర్తించిన వారిని సహించబోనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారని చెబుతున్నారు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినవారు చాలా జాగ్రత్తగా ఉండాలని హితబోధ చేశారని అంటున్నారు. గత ఎన్నికల్లో పాతపట్నం ఎమ్మెల్యేగా గోవిందరావు గెలిచారు. ఈ నియోజకవర్గంలో టీడీపీ తొలి నుంచి బలంగా ఉండేది. సీనియర్ నేత కలమట కుటుంబమే ఇక్కడి నుంచి ఆరుసార్లు ప్రాతినిధ్యం వహించింది. అటువంటి నేతను కాదని గత ఎన్నికల్లో ఎమ్మెల్యే గోవిందరావుకు తొలిసారి అవకాశం ఇచ్చారు. రాజకీయాలకు కొత్త అయినా, ఎన్నికలకు ముందు కేడర్ తో సత్సంబంధాలు ఏర్పరుచుకుని గోవిందరావు పార్టీలో మంచి పేరు తెచ్చుకున్నారు. కానీ, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆయన పద్ధతిలో చాలా మార్పు కనిపిస్తోందని కార్యకర్తలే ఆరోపిస్తున్నారు. పార్టీలో సీనియర్లను పక్కన పెట్టేలా నడుచుకోవడమే కాకుండా, నియోజకవర్గంలో తన ప్రమేయం లేకుండా ఏ పనీ జరగడానికి వీల్లేదన్నట్లు ఎమ్మెల్యే నడుచుకోవడం విమర్శలకు తావిస్తోందని అంటున్నారు. చివరికి పత్రికల్లో ప్రభుత్వ పథకాల కోసం రాయాలన్నా ఎమ్మెల్యే అనుమతి ఉండాలన్నట్లు వ్యవహారం వెళ్లిందని, దీంతో ఆయన విషయమై ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబుకు భారీగా ఫిర్యాదులు వెళ్లినట్లు చెబుతున్నారు.

# అమ్మాయిలే లక్ష్యంగా జీహాదీ ట్రైనింగ్

విజయవాడ, ఏప్రిల్ 9,

విజయవాడ టెర్రర్ లింక్ కేసులో హైదరాబాద్‌కు చెందిన సైదా బేగం విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మహిళలను ఉగ్రవాదం వైపు ఆకర్షించే బాధ్యతను సైదా బేగం తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ప్రత్యేకంగా యువతులను లక్ష్యంగా చేసుకుని వారిని రిక్రూట్ చేయాలని ఉగ్రవాద సంస్థలు ఆమెకు టాస్క్ ఇచ్చినట్టు అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు దాదాపు 42 మంది అమ్మాయిలను ఆమె తన నెట్‌వర్క్‌లోకి తీసుకువచ్చినట్లు సమాచారం.రిక్రూట్ చేసిన మహిళలకు స్నిప్పర్ రైఫిల్ వినియోగం, షూటింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వాలనే సూచనలు కూడా సైదాకు అందినట్లు విచారణలో వెల్లడైంది. “ఖ్వాతీన్” పేరుతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ నిర్వహిస్తూ మహిళలను ఒక్కచోట చేర్చి, వారిలో తీవ్రవాద భావజాలాన్ని పెంపొందించే ప్రయత్నాలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. యువతను మతపరంగా ఆకర్షించి నెట్‌వర్క్‌ను విస్తరించాలని జిహాదీ గ్రూపులు ఆమెకు నిరంతరం ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.ఈ క్రమంలోనే ఒసామా బిన్ లాడెన్, జకీర్ నాయక్ వీడియోలను షేర్ చేస్తూ యువతలో తీవ్రవాద భావజాలాన్ని నింపేందుకు సైదా ప్రయత్నించినట్లు పోలీస్ అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు 40 అకౌంట్లు తెరిచి జిహాదీ ప్రచారం కొనసాగించినట్టు గుర్తించారు. మదర్సాల్లో మతపరమైన శిక్షణ పూర్తయ్యాక ఆయుధాల వినియోగంపై ట్రైనింగ్ ఇవ్వడానికి ప్రణాళికలు రూపొందించినట్టు విచారణలో తేలింది. సైదా ఉపయోగించిన వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల నుంచి పెద్ద ఎత్తున ఫైల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# వేగంగా ఫ్యూచర్ సిటీ అడుగులు

హైదరాబాద్, ఏప్రిల్ 9, (

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై స్టే ఇచ్చేందుకు చెన్నై ఎన్జీటీ నిరాకరించింది. పర్యావరణ అనుమతులు లేకుండానే ఫ్యూచర్ సిటీని ప్రభుత్వం చేపడుతోందని పిటిషనర్ వాదించగా.. అది ఇంకా తొలి దశలోనే ఉందని.. ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని ప్రభుత్వం తరఫు లాయర్ వాదించారు. అయితే నిబంధనలను ఉల్లంఘించి ఎక్కడా పనులు చేయబోమని ఎన్జీటీకి ప్రభుత్వం తరఫు లాయర్ వివరించారు. దీంతో ఈ పిటిషన్‌పై విచారణను ఎన్జీటీ వాయిదా వేసింది.తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్ సిటీకి సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) చెన్నై ధర్మాసనం.. ఊరట కల్పించింది. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు నిర్మాణంపై దాఖలైన పిటిషన్‌పై స్టే ఇచ్చేందుకు ఎన్జీటీ చెన్నై బెంచ్ నిరాకరించింది. దీంతో రేవంత్ రెడ్డి సర్కార్‌కు రిలీఫ్ కలిగింది. ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ నోటిఫికేషన్-2006లో వెల్లడించిన ప్రకారం.. పర్యావరణ అనుమతులు లేకుండానే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని.. హైదరాబాద్ కొంపల్లికి చెందిన డాక్టర్ దొంతి నర్సింహా రెడ్డి.. ఎన్జీటీలో పిటిషన్ వేయగా.. తాజాగా విచారణ జరిపింది.దాదాపు 30 వేల ఎకరాల్లో ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును నిర్మించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని పిటిషనర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు నిర్మాణంపై స్టే విధించాలని పిటిషనర్ డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి కోరారు. అదే సమయంలో పర్యావరణ అనుమతులు లేకుండా ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు అభివృద్ధి పనులు చేపట్టడం చట్ట విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఇక ఈ వ్యవహారంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ తేరా రజినీకాంత్ రెడ్డి వాదనలు వినిపించారు.ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించి.. ఇప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు గానీ, అభివృద్ధి కార్యక్రమాలు గానీ ప్రారంభించలేదని ప్రభుత్వం తరఫు లాయర్ వివరించారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ప్రారంభ దశలోనే ఉందని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో చట్టవిరుద్ధంగా.. నిబంధనలను అతిక్రమించి.. ఎలాంటి పనులు చేపట్టబోమని హామీ ఇచ్చారు. ఇక త్వరలోనే పర్యావరణంతోపాటు అన్ని రకాల అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఇరు వైపులా వాదనలు విన్న చెన్నై ఎన్జీటీ బెంచ్.. ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు ఇంకా ప్రారంభం కానందున అనుమతులు తీసుకునేందుకు ఇంకా సమయం ఉందని పేర్కొంటూ.. దీనిపై స్టే ఇచ్చేందుకు నో చెప్పింది. ఇక పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను జూన్ 9వ తేదీకి వాయిదా వేసింది.

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ మీదుగా ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఓఆర్ఆర్ కొంగరకలాన్ నుంచి ఆమనగల్ మండలం ఆకుతోటపల్లి వద్ద రీజినల్ రింగు రోడ్డు వరకు ఈ ప్రాజెక్టును చేపట్టారు. అయితే ఈ కొత్త రహదారి నిర్మాణం చుట్టూ న్యాయవివాదాలు ముసురుకుంటున్నాయి. ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు భూసేకరణ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. రోడ్డు నిర్మాణ ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారంటూ30 మంది రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. యాచారం మండలం కుర్మిద్ద, కడ్తాల్ మండలం కడ్తాల్, ముద్విన్, ఆమనగల్ మండలం ఆకుతోటపల్లి గ్రామాల్లో మొత్తం 554.34 ఎకరాల సేకరణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. అయితే.. భూసేకరణ, పునరావాసం చట్టం-2013లో పేర్కొన్న తప్పనిసరి నిబంధనలను అధికారులు తుంగలో తొక్కారని వారు ఆరోపించారు. ముఖ్యంగా నిర్వాసిత రైతుల నుంచి అభ్యంతరాలను తీసుకోవాల్సి ఉండగా.. ఆ ప్రక్రియను మొక్కుబడిగా పూర్తి చేశారని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు.తమ అభ్యంతరాలను అకారణంగా తిరస్కరించారని ఇది చట్టవిరుద్ధమని, ఏకపక్షమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 61.24 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తమ భూముల నుంచి తమను బలవంతంగా ఖాళీ చేయించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ.. భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌పై వాదనలు విన్న జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ పిటిషన్‌పై విచారణ జరిపి వాస్తవ పరిస్థితులపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మొత్తం 554.34 ఎకరాల్లో సుమారు 200 ఎకరాల భూమి వివాదంలో ఉందని.. మిగిలిన భూమికి సంబంధించి 26 ఎకరాలకు ఇప్పటికే పరిహారం అవార్డులు జారీ చేశామని వెల్లడించారు. ప్రాజెక్టు ప్రాముఖ్యత దృష్ట్యా భూసేకరణపై స్టే ఇవ్వవద్దని ఆయన కోర్టును కోరారు. అలాగే.. రైతులకు పరిహారం చెల్లించే వరకు వారిని భూముల నుంచి ఖాళీ చేయించబోమని ప్రభుత్వం తరపున హామీ ఇచ్చారు. ఈ హామీని పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. తదుపరి విచారణను సెలవుల తర్వాతకు వాయిదా వేసింది.

# మాటలతో హామీల అమలు... వాక్చాతుర్యంతో బురిడి

హైదరాబాద్, ఏప్రిల్ 9,

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండున్నర ఏళు గడుస్తున్న తరుణంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర ప్రధాన హామీల అమలు తీరుపై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో పెళ్లైన మూడు నెలలకే బిడ్డ పుడతారా అంటూ హామీల అమలుకు సమయం కావాలని కోరుతున్నప్పటికీ, సామాన్య ప్రజానీకం మాత్రం ఫలితాల కోసం వేచి చూస్తోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం , ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలులోకి తెచ్చింది. ఇవి క్షేత్రస్థాయిలో ప్రజలకు కొంత ఉపశమనం కలిగించాయి. అలాగే, గ్యాస్ సిలిండర్లను రూ. 500 కే అందించే పథకం కూడా లబ్ధిదారులకు అందుతోంది. అయితే, ఇవి కేవలం ఆరు గ్యారంటీలలోని ఒక భాగం మాత్రమే. అత్యంత కీలకమైన మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 నగదు బదిలీ హామీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. దీనిపై కోట్లాది మంది మహిళలు ఆశలు పెట్టుకున్నారు. అలాగే, రైతులకు ఇస్తామన్న రూ. 15,000 రైతు భరోసా పంపిణీలో కూడా జాప్యం జరుగుతోంది. పాత బకాయిలు తీర్చడానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటంతో, కొత్తగా పెంచిన మొత్తాన్ని ఎప్పుడు ఇస్తారనే దానిపై స్పష్టత కరువైంది. యువతకు ఇస్తామన్న యువ వికాసం కార్డులు, నిరుద్యోగ భృతి వంటివి కూడా ఇంకా చర్చల దశలోనే ఉన్నాయి. అతి పెద్ద సవాల్ పెన్షన్ల పెంపు. వృద్ధులకు, ఒంటరి మహిళలకు సహా అనేక వర్గాలకు ఇస్తున్న పెన్షన్లను భారీగా పెంచుతామని రేవంత్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు.కానీ ఇప్పటి వరూక అమలు కాలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచుగా గత ప్రభుత్వం వదిలి వెళ్లిన 7 లక్షల కోట్ల అప్పుల గురించి ప్రస్తావిస్తూ, ఖజానా ఖాళీగా ఉండటం వల్లే హామీల అమలులో జాప్యం జరుగుతోందని వివరిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా తనను తాను సమర్థించుకోవడానికి ఉపయోగపడవచ్చు కానీ, ప్రజల్లో ఉన్న అసహనాన్ని తగ్గించలేకపోతున్నాయి. సంక్షేమ పథకాలకు నిధులు సర్దుబాటు చేయడం కోసం ప్రభుత్వం కొత్త అప్పులు చేయాల్సి రావడం లేదా ఇతర అభివృద్ధి పనులకు నిధులు కోత విధించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజలు ఒక ప్రభుత్వాన్ని ఎన్నుకున్నప్పుడు ఆరు నెలల నుండి ఏడాది లోపు కనీస మార్పును ఆశిస్తారు. రెండున్నర ఏళ్లు దాటినా కీలక హామీలు అందకపోవడం వల్ల ప్రజల్లో నెమ్మదిగా వ్యతిరేకత మొదలయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా మధ్యతరగతి , గ్రామీణ ఓటర్లు కేవలం వివరణల కంటే, తమ ఖాతాల్లోకి వచ్చే నగదు లేదా తమ బతుకుల్లో వచ్చే మార్పునే గమనిస్తారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన వాక్చాతుర్యంతో ఎంతకాలం నెట్టుకొస్తుందో కానీ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి హామీల అమలులో పురోగతి చూపకపోతే అది పార్టీకి నష్టం చేకూర్చవచ్చు.ప్రజాస్వామ్యంలో ఎన్నికల మేనిఫెస్టో అనేది ఒక పవిత్రమైన పత్రం. దానిని కేవలం ఓట్లు దండుకోవడానికి ఉపయోగించే కాగితం గా కాకుండా, ప్రజలతో చేసుకున్న ఒప్పందంగా భావించాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వివరణలను పక్కన పెట్టి, ఆర్థిక వనరులను సమకూర్చుకుని మిగిలిన హామీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, మరో అవకాశం ఇస్తాం అని చెప్పే లోపే ప్రజల నుంచి గట్టి ప్రతిఘటన ఎదురయ్యే ప్రమాదం ఉంది.

# మురుగునీరు పారేదెలా...

వరంగల్, ఏప్రిల్ 9,

కొండ నాలుకకు మందు వేస్తే.. ఉన్న నాలుక ఊడింది అన్న చందంగా కేసముద్రం పట్టణ డ్రైనేజీ పరిస్థితి మారింది. కేసముద్రం మండల కేంద్రాన్ని కేసముద్రం స్టేషన్, కేసముద్రం విలేజ్, అమీనాపురం, ధనసరి, సబ్ స్టేషన్ తండా గ్రామాలను విలీనం చేసి కొత్తగా మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. కేసముద్రం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్



రెడ్డి ప్రత్యేకంగా చొరవచూపి ప్రభుత్వం నుండి వందల కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించారు.ఇందులో భాగంగా రోడ్ల విస్తరణతో పాటు డ్రైనేజీ మెరుగుపరచడానికి చర్యలు చేపట్టారు. రోడ్ల విస్తరణ పనులను ప్రారంభించగానే కొందరు తమకు నష్టం జరుగుతోందని, ఇండ్లు కోల్పోతున్నామని అభ్యంతరం వ్యక్తం చేయడంతో రోడ్ల పనులు పలుచోట్ల అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రోడ్ల విస్తరణ కోసం పాత డ్రైనేజీ కాలువలను పూర్తిగా తవ్వడంతో ఇప్పుడు మురుగు నీరు అంతా ఎక్కడికి అక్కడే తిష్ట వేస్తోంది.గతంలో ఉన్న డ్రైనేజీలను పూర్తిగా తొలగించడం వల్ల పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట, అలాగే వీధుల్లో ఎక్కడికక్కడే నిలిచిపోయి కంపు కొడుతున్నాయి. ఇండ్ల ముందు, షాపుల వద్ద కొన్నిచోట్ల సైడ్ కాలువల్లో మురుగునీరు తిష్ట వేసి, అనారోగ్యానికి అడ్డాలుగా మారుతున్నాయి. దీంతో కొందరు గత్యంతరం లేక ఇంటి ఎదుట మురుగునీరు నిలువ కోసం ఇంకుడు గుంతలు నిర్మించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇక ఫ్లై మహాత్మ జ్యోతిబాపూలే సెంటర్ నుండి రైల్వే ఫ్లైఓవర్ మీదుగా పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకు రోడ్డు విస్తరించినప్పటికీ డ్రైనేజీ పనులు చేపట్టలేదు. దీనితో ఆ రహదారి వెంట ఇరువైపులా ఉన్న షాపులు, ఇండ్లలోని మురుగునీరు అక్కడే తిష్ట వేస్తోంది. ఇక వర్షాకాలం వస్తే వరద నీరు కూడా రోడ్డుపైనే ప్రవహించాల్సిన పరిస్థితి నెలకొంది. కేసముద్రం పట్టణంలో మందు వేసవికాలంలోనే డ్రైనేజీ వ్యవస్థ, మురుగునీరు ముందుకు సాగని పరిస్థితి ఇలా ఉంటే, ఇక వర్షాకాలంలో ప్రజలు ఎన్ని తిప్పలు పడాలో అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారుఎక్కడి నీరు అక్కడే నిలిచి ఉండడం వల్ల దోమల బెడద తీవ్రంగా పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు స్పందించి అభ్యంతరం లేని చోట పనులు పూర్తిచేసి ఇబ్బందులు తొలగించాలని, మున్సిపాలిటీ అధికారులు మురుగునీరు నిలవకుండా పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.పాత కాలువలను కూలగొట్టారు. కొత్తవి నిర్మించకుండా వదిలేశారు. మురుగు నీరు అంతా ఇంటి ముందే నిలుస్తోంది. దుర్గంధం వల్ల ఇంట్లో ఉండడం కష్టం కాగా, కనీసం బయటకు కూడా రాలేని పరిస్థితి నెలకొంది. రోడ్లు పూర్తి చేయకపోవడంతో అటు దుబ్బ, ఇటు సైడ్ కాలువలు నిర్మించకపోవడంతో దుర్గంధంతో ఇంట్లో నుండి కాలు బయట పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. అభివృద్ధి పేరుతో ఇబ్బందులకు గురి చేయడం సరికాదు.కేసముద్రం పట్టణ అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన ప్రధాన, అంతర్గత డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మురుగునీరు ఎక్కడ కూడా నిలవకుండా అవసరమైన లెవెల్స్ తీసుకోవడానికి ఇంజనీరింగ్ అధికారుల ద్వారా చర్యలు చేపట్టాం. వర్షాకాలానికి ముందే డ్రైనేజీ పనులను పూర్తి చేయిస్తాం.

# మూడు రాష్ట్రాల్లో పోలింగ్ ప్రారంభం

న్యూఢిల్లీ ఏప్రిల్ 9,

కేరళం, అస్సాం, పుదుచ్చేరిలో ఒకే విడతలో పోలింగ్ గురువారం ప్రారంభం అయింది. అస్సాంలో హ్యాట్రిక్ పై బీజేపీ, కేరళంలో హ్యాట్రిక్ పై లెఫ్ట్ కూటమి గురిపెట్టాయి. హోరాహోరీగా బిజెపి, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల పోరాటం జరగనున్నది. మూడు రాష్ట్రాల్లో 6.1 కోట్లకు పైగా ఓటర్లు వున్నారు. అస్సాంలో మొత్తం 126 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగుతోంది. 2.5 కోట్ల మంది ఓటర్లు వున్నారు. కేరళంలో 140 అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ జరగనుండగా, 2.71 కోట్ల మంది ఓటర్లు నమోదయ్యారు. ఇక కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో 30 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ 9.44 లక్షల మంది ఓటర్లు వున్నారు. ఎన్నికల ఫలితాలు మే 4 న వెలువడనున్నాయి.

# యానం లో పోలింగ్ షురూ

యానం ఏప్రిల్ 9,

గురువారం నాడు కేంద్రపాలిత యానాం (పుదుచ్చేరి)లో అసెంబ్లీ ఎన్నికలు ప్రారంభం అయ్యాయి. 37,972 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోటి బరిలో 13 మంది అభ్యర్థులు వున్నారు. ఎన్.ఆర్ కాంగ్రెస్ నుండి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, కాంగ్రెస్ నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్, టివికె పార్టీ నుండి తోట రాజు పోటీ చేస్తున్నారు. ఉ.7 గం.ల నుండి మొదలైన పోలింగ్.. సా.6 గంటల వరకు ఓటింగుకు అవకాశం వుంది. 42 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసారు. అందులో ..13 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై అధికారలు దృష్టిసారించారు.

## జనగామ ఆస్పత్రిలో పసిపాప కిడ్నాప్ కలకలం

జనగామ్, ఏప్రిల్ 9,

జనగామ మాతా శిశు ఆసుపత్రిలో బుధవారం రాత్రి ఒక మహిళ పసికందును ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించింది. ఆటోలో తరలిస్తున్న శిశువును కుటుంబ సభ్యులు, స్థానికులు వెంబడించి పట్టుకున్నారు. ఆగ్రహంతో మహిళకు దేహశుద్ధి చేశారు. ఈ ఘటనతో ఆసుపత్రిలో ఉద్రిక్తత నెలకొంది. కుటుంబ సభ్యులు ఆసుపత్రి డోర్లు, అద్దాలను ధ్వంసం చేశారు. పోలీసులు మహిళను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయిన జనగామ ఎమ్మెల్యే

హైదరాబాద్

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ని సైబర్ నేరగాళు టార్గెట్ చేసారు. కేంద్ర పథకం పేరుతో ఎమ్మెల్యేను మోసం చేసారు. అపరిచిత ఫోన్ కాల్ ద్వారా తెలంగాణ ఆర్థికశాఖలో అదనపు కార్యదర్శి అనంత అంటూ పరిచయం చేసుకొని పల్లా రాజేశ్వర్ రెడ్డి నుంచి లక్ష రూపాయలు కాజేసాడు. "వికసిత్ భారత్" పథకం పేరుతో నిందితుడు నమ్మబలికాడు. అర్హుల జాబితా పంపిస్తే రూ.10 లక్షల రుణాలు అంటూ మోసం చేసాడు. ఒక్కొక్కరికి 2,500 చొప్పున 1లక్ష ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేసాడు. ఎమ్మెల్యే ఫోన్ పే ద్వారా డబ్బులు పంసారు. మళ్లీ డబ్బులు అడగడంతో అనుమానం వచ్చింది. దాంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేపారు.

## సంతోష్ నగర్ లో గ్యాంగ్ వార్..యువకుడిపై దాడి

హైదరాబాద్ ఏప్రిల్ 9,

పాతబస్తీలో మాయా గ్యాంగ్ అరాచకాలు పెచ్చరిల్లిపోతున్నాయి. తాజాగా సంతోష్నగర్ పరిధిలోని జవహర్ కాలనీలో బాసిత్ అనే యువకుడిపై సోహైల్, సాద్ అనే సభ్యులు విచక్షణారహితంగా దాడి చేసారు. ఈ దారుణ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. అకారణంగా దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. గతంలోనూ ఈ గ్యాంగ్పై అనేక కేసులున్నట్లు తెలుస్తోంది. పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

## జీడిమెట్లలో భారీ అగ్ని ప్రమాదం

మేడ్చల్

జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని రాంరెడ్డి నగర్లో అక్రమంగా నిల్వ ఉంచిన సాల్వెంట్ డ్రమ్ముల గోదాంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. మంటల తీవ్రతకు కెమికల్ డ్రమ్ములు భారీ శబ్దాలతో పేలుతూ రోడ్లపైకి ఎగసిపడ్డాయి. దీంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకోవడంతో, స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అగ్ని ప్రమాదంతో ఆందోళనలో స్థానికులున్నారు

మరోవైపు, దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహదూర్పల్లి గ్రీన్ హిల్స్ కాలనీలో ఉన్న ఓ డెకరేషన్ సామగ్రి గోదాంలో మరో అగ్నిప్రమాదం జరిగింది. ప్లాస్టిక్ వస్తువులు ఎక్కువగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి పక్కనే ఉన్న ఇంటికి కూడా అంటుకున్నాయి.

## బాలాపూర్ లో అక్రమంగా నిల్వచేసిన రైస్ గోదాంలో అధికారుల దాడులు

రంగారెడ్డి, ఏప్రిల్ 9,

బాలాపూర్ పోలీస్ పరిధిలోని సుల్తాన్పూర్ ప్రాంతంలో అక్రమ గోదాంపై పోలీసులు, సివిల్ సప్లైస్ అధికారులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో 523 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 69 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్కు నష్టం కలిగిస్తూ రేషన్ను అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. ఈ ఆపరేషన్లో జిల్లా సివిల్ సప్లైస్ అధికారి వనజాత, ఏఎస్ఓ రాజేంద్రనగర్ వి. పుల్లయ్య, సివిల్ ఇన్స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు. బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మూడు నెలల్లో వరంగల్ విమానాశ్రయానికి ఫౌండేషన్

హైదరాబాద్ ఏప్రిల్ 9,

తెలంగాణలో విమానయాన రంగాన్ని విస్తరించడంలో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి మరో మూడు నెలల్లో ఫౌండేషన్ వేయబోతున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు.

ఆదిలాబాద్ విమానాశ్రయానికి కూడా మార్గం సుగమమైంది. రక్షణ శాఖకు చెందిన 360 ఎకరాలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం మరో 450 ఎకరాలు భూమి సేకరిస్తే.. ఈ ఎయిర్పోర్ట్ రూపుదిద్దుకుంటుందని అన్నారు. రక్షణ శాఖ వ్యూహాత్మక ప్రాంతం కావడంతో డిఫెన్స్ మినిస్ట్రీనే దీనిని నిర్మిస్తుంది. సివిల్ ఏవియేషన్ శాఖ ప్రత్యేక టర్మినల్ను ఏర్పాటు చేస్తుంది. ఏప్రిల్ 17న రాబూ సర్వే నిర్వహించి, ఎయిర్ పోర్ట్ మాస్టర్ ప్లాన్ను ఖరారు చేస్తామని అన్నారు.

# జీవన్‌రెడ్డికి సెక్రటరీ జనరల్ పదవి.. సీనియర్ల గుసగుసలు

కరీంనగర్, ఏప్రిల్ 9,

కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉంటూ, కష్టకాలంలోనూ పార్టీ జెండా మోసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి.. ఇప్పుడు అదే పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ వైపు అడుగులు వేస్తున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ లో చేర్చుకోవడం.. మున్సిపల్ ఎన్నికల ముందే ఆయనకు ప్రాధాన్యత ఇవ్వడం జీవన్ రెడ్డిని తీవ్ర అసహనానికి గురిచేసింది. గెలిచిన నేతలను చేర్చుకుంటూ ఓడిన మమ్మల్ని అవమానిస్తారా అంటూ ఆయన పార్టీకి గుడ్ బై చెప్పారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన గులాబీ తీర్థం పుచ్చుకుంటారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్ అధిష్టానం జీవన్ రెడ్డికి కేకే వదిలిపెట్టిన సెక్రటరీ జనరల్ వంటి కీలక పదవిని ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో కేసీఆర్ తర్వాత అంతటి ప్రాధాన్యత ఉన్న పదవిని, కొత్తగా వచ్చిన వ్యక్తికి కట్టబెట్టడంపై మొదటి నుండి కారు పార్టీని నమ్ముకున్న సీనియర్లలో అసంతృప్తిని కలిగించే అవకాశం ఉంది. ఎంతో కాలంగా పార్టీని అంటిపెట్టుకున్న ఇతర ఉమ్మడి కరీంనగర్ నేతలను పక్కనపెట్టి, నిన్నటిదాకా తమను తిట్టిన నేతకు రెడ్ కార్పెట్ వేయడం ఏమిటని కొందరు నేతలు అంతర్గత సమావేశాల్లో చర్చించుకుంటున్నారు. జీవన్ రెడ్డి రాకతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నాయకత్వ సమీకరణాలు పూర్తిగా మారిపోనున్నాయి. ఇప్పటికే జిల్లాలో గంగుల కమలాకర్ వంటి బలమైన నేతలు ఉండగా, ఇప్పుడు జీవన్ రెడ్డి వంటి దిగ్గజం చేరడం ఆధిపత్య పోరు కు దారితీయవచ్చు. ముఖ్యంగా జగిత్యాలలో బీఆర్ఎస్ శ్రేణులు ఇప్పుడు ఎవరి కింద పనిచేయాలన్న గందరగోళంలో ఉన్నాయి. నిన్నటిదాకా కొట్టుకున్న వర్గాలు ఇప్పుడు ఒకే జెండా కింద ఎలా కలిసి సాగుతాయన్నది పెద్ద ప్రశ్న. జగిత్యాల నియోజకవర్గంలో జీవన్ రెడ్డికి ఉన్న వ్యక్తిగత ఇమేజ్ బీఆర్ఎస్‌కు బలంగా మారవచ్చు కానీ, అది పాత క్యాడర్‌లో చీలిక తెచ్చే ప్రమాదం ఉంది. సంజయ్ కుమార్ వైఖరికి వ్యతిరేకంగా జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి వస్తుండటంతో, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, ద్వితీయ శ్రేణి నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయే అవకాశం ఉంది. ఎన్నో అవకాశాలు వచ్చినా గెలవని జీవన్ రెడ్డిని చేర్చుకోవడం వల్ల పార్టీకి లాభమా లేక నష్టమా అనే చర్చ బీఆర్ఎస్‌లో జరుగుతున్నా, ఆయన అనుభవం పార్టీకి అవసరమని అధిష్టానం గట్టిగా నమ్ముతోంది. అయితే, ఈ నిర్ణయం కరీంనగర్ గులాబీ తోటలో ముళ్లు జల్లినట్టే అవుతుందన్నది విశ్లేషకుల అంచనా. జీవన్ రెడ్డికి అంత ప్రజాబలం లేదని.. అయనకు బదలుగా యువనేతల్ని ప్రోత్సహిస్తే మంచిదని.. గతంలో కేకేను ప్రోత్సహిస్తే ఏం జరిగిందో తెలుసుకదా అని క్యాడర్ ప్రశ్నిస్తున్నారు.

మరో వైపు

ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో జీవన్ రెడ్డి టచ్‌లో ఉన్నారు. ఒక దఫా ప్రాథమిక చర్చలు కూడా ముగిసినట్లు జీవన్ రెడ్డి అనుచరులు చెబుతున్నారు. జీవన్ రెడ్డికి పార్టీలో కీలక పదవి.. ఆయన కోడలికి జగిత్యాల టికెట్ లాంటి అంశాలను చర్చించినట్టు తెలుస్తోంది. జీవన్ రెడ్డి సీనియార్టీకి తగిన పదవితో పాటు వచ్చే ఎన్నికల్లో ఆయన కోరిన వారికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ అంగీకరించిందన్న టాక్ వినిపిస్తోంది. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌తో విభేదాల కారణంగా కాంగ్రెస్ పార్టీపై తీవ్ర అసహనంతో ఉన్నారు జీవన్



రెడ్డి. కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పాక తన అనుచరులతో సుదీర్ఘ చర్చలు జరిపారు. కొంత మంది అనుచరులు బీజేపీ వైపు వెళ్దామని సలహా ఇచ్చినప్పటికీ తనకున్న ముస్లిం అనుచరులు, మైనార్టీ ఓటు బ్యాంక్ దృష్ట్యా జీవన్ రెడ్డి బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. కేటీఆర్, హరీష్ రావులతో చర్చల అనంతరం జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే తేదీ ఖరారు కానుంది

# 13 ప్రాంతాల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు

హైదరాబాద్, ఏప్రిల్ 9,

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు టీజీఆర్టీసీ తన రవాణా వ్యవస్థను ఆధునీకరిస్తోంది. పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు పాత డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్న ఆర్టీసీ.. ఇప్పుడు వాటికి అవసరమైన మౌలిక సదుపాయాల విస్తరణపై దృష్టి సారించింది. నగరంలోని అన్ని ప్రధాన డిపోల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి వచ్చేలా ఆర్టీసీ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఇప్పటికే కంటోన్మెంట్, మియాపూర్, రాణిగంజ్, హయత్‌నగర్, హెచ్‌సీయూ వంటి కీలక డిపోల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉండగా.. వచ్చే నెలలో కూకట్‌పల్లి స్టేషన్‌ను కూడా ప్రారంభించనున్నారు. నగరవ్యాప్తంగా మరో 13 కొత్త ప్రాంతాల్లో ఈవీ ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఫరూక్‌నగర్, బర్కత్‌పుర, మెహిదీపట్నం, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, ఉప్పల్, చెంగిచెర్ల, జీడిమెట్ల, కాచిగూడ, మిధాని, బండ్లగూడ, ముషీరాబాద్, జవహర్‌నగర్ డిపోలను ఇందుకోసం ఎంపిక చేశారు. ఏడాది కాలంలోనే ఈ స్టేషన్లన్నింటినీ ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు గడువు విధించుకున్నారు. ఈ ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి వస్తే నగరంలోని వివిధ రూట్లలో ఎలక్ట్రిక్ బస్సుల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయిరాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం.. రానున్న రెండేళ్లలో ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కేవలం ఎలక్ట్రిక్ బస్సులను మాత్రమే నడపాలని డిసైడ్ అయ్యారు. దీనివల్ల నగరంలో కార్బన్ ఉద్గారాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం గ్రేటర్ జోన్ పరిధిలో 490 ఎలక్ట్రిక్ బస్సులు వివిధ డిపోల నుంచి విజయవంతంగా రాకపోకలు సాగిస్తున్నాయి. విడతలవారీగా కొత్త బస్సులు రోడ్డుపైకి రానున్నాయని.. అందుకు అనుగుణంగా ఛార్జింగ్ పాయింట్ల సంఖ్యను కూడా పెంచుతున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. కేవలం బస్సుల సంఖ్యను పెంచడమే





కాకుండా.. ఛార్జింగ్ స్టేషన్ల వద్ద అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఫాస్ట్ ఛార్జింగ్ సౌకర్యాల వల్ల బస్సుల వెయిటింగ్ టైమ్ తగ్గి, మెరుగైన సేవలందించడానికి వీలవుతుందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఈ మెగా ప్రాజెక్ట్ పూర్తయితే హైదరాబాద్ దేశంలోనే అత్యధిక ఎలక్ట్రిక్ ప్రజా రవాణా వ్యవస్థ కలిగిన నగరాల్లో ఒకటిగా నిలుస్తుందని అంటున్నారు. నగరవాసులకు కాలుష్య రహిత, సుఖవంతమైన ప్రయాణాన్ని అందించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశమని చెబుతున్నారు.

# పచ్చనిదంతా మామిడి కాదు...

హైదరాబాద్ ఏప్రిల్ 9,

వేసవి కాలం వచ్చిందంటే చాలు.. అందరికీ ముందుగా గుర్తొచ్చేది తియ్యని మామిడి పండ్లు. కానీ, ఈ ఏడాది హైదరాబాద్ మార్కెట్లలో మామిడి పండ్ల కొనుగోలుపై జనం ఆందోళన చెందుతున్నారు. పండ్లను త్వరగా పండించడానికి వ్యాపారులు వాడుతున్న ప్రమాదకర రసాయనాల వల్ల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని వార్తలువినిపిస్తున్నాయి. ముఖ్యంగా క్యాల్షియం కార్బైడ్ వాడకంపై నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరి ఈ వేసవిలో మనం తినే మామిడి పండ్లు ఎంతవరకు సేఫ్? ఆ వివరాలు చూద్దాం.. ఓపెన్ ఏఐ సంచలన రిపోర్టు..మామిడి పండ్లు సహజంగా పండాలంటే సమయం పడుతుంది. కానీ, మార్కెట్లోకి అందరికంటే ముందుగా పండ్లను తెచ్చి లాభాలు గడించాలని కొంతమంది వ్యాపారులు క్యాల్షియం కార్బైడ్ అనే రసాయనాన్ని వాడుతున్నారు. ఇక ఇది పండ్లను బయటకు చాలా అందంగా, పచ్చగా కనిపించేలా చేస్తుంది. కానీ, లోపల మాత్రం అవి విషపూరితంగా మారుతున్నాయి. ఈ రసాయనం వల్ల పండ్లలోని సహజమైన రుచి, పోషకాలు నశించిపోతాయి. ఇక పండ్లు కొనేటప్పుడు అవి మరీ పసుపు పచ్చగా మెరిసిపోతుంటే కాస్త జాగ్రత్తగా ఉండటం మంచిది. ఈ రసాయనాలతో పండిన పండ్లను తింటే వెంటనే వాంతులు, కడుపునొప్పి, తల తిరగడం వంటి సమస్యలు రావచ్చు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు వీటిని తింటే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉంది. ఇక దీర్ఘకాలంలో ఇలాంటి కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల కిడ్నీలు, కాలేయంపై ప్రభావం పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పండ్లను ఆరోగ్యకరమైన ఆహారంగా భావించి తినే సామాన్యులకు, ఇలాంటి రసాయనాలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. అధికారులు మేల్కోవాల్సిన సమయం: హైదరాబాద్‌లోని వివిధ మార్కెట్లలో ఇప్పటికే ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు.



అయితే, కేవలం ఒకట్రెండు సార్లు తనిఖీలు చేస్తే సరిపోదని, సీజన్ మొత్తం నిరంతరం నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. ఇక నిబంధనలు అతిక్రమించి హానికరమైన రసాయనాలు వాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మార్కెట్లకు వచ్చే పండ్ల నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించడం ద్వారానే ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇవ్వగలం. ఆహార భద్రత అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు మార్కెట్‌లో పండ్లు కొనేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించడం అవసరం. పండు మొత్తం ఒకే రంగులో ఉండి, మరీ ఆకర్షణీయంగా ఉంటే అది రసాయనాలతో పండిందేమో అని అనుమానించాలి. సహజంగా పండిన పండ్లు అక్కడక్కడా కొంచెం పచ్చగా, కొంచెం పసుపుగా ఉంటాయి. పండ్లు తెచ్చిన తర్వాత వాటిని కనీసం అరగంట పాటు నీళ్లలో నానబెట్టి, బాగా కడిగిన తర్వాతే తినాలి. వీలైతే విశ్వసనీయమైన రైతుల వద్ద లేదా ఆర్గానిక్ స్టోర్లలో పండ్లను కొనుగోలు చేయడం ఉత్తమం. ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు.. అందుకే కేవలం రంగును చూసి పండ్లను కొని మోసపోకండి. మనం కొంచెం జాగ్రత్తగా ఉంటే, మన కుటుంబాన్ని ఈ రసాయన ముప్పు నుంచి కాపాడుకోవచ్చు. అధికారులు, వ్యాపారులు, ప్రజలు.. అందరూ బాధ్యతగా ఉంటేనే ఈ వేసవిలో తియ్యని మామిడి పండ్లను నిశ్చింతగా ఆస్వాదించగలం..

# భూభారతి ఇంటిగ్రేటెడ్ పోర్టల్ రెడీ

నిజామాబాద్ ఏప్రిల్ 9,

భూముల సమస్యలు రాకుండా ఉండేందుకు రేవంత్ సర్కార్ భూభారతి పోర్టల్ ద్వారా పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేసేందుకు రెడీ అయింది. భూముల రిజిస్ట్రేషన్ కోసం.. ముందుగా సర్వే చేసి.. అక్కడి భూమికి, రికార్డుల్లో సమాచారం సరిపోలితేనే ఇక నుంచి రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. ఇక ఒక్కసారి రిజిస్ట్రేషన్ అయిన భూమి సర్వే నంబర్లు గానీ, విస్తీర్ణం గానీ మార్చే అవకాశం లేకుండా పక్కా చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమించినా భూభారతితో వారిని గుర్తించనున్నారు. భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో ఎన్నో సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి, రికార్డుల్లో ఉన్న భూమికి అసలు పొంతన ఉండదు. ప్రభుత్వ భూములు, ఇతరుల భూమిని ఆక్రమించి ఉన్న భూముల కంటే ఎక్కువ భూములను రిజిస్ట్రేషన్లు చేసుకునే వారు ఉంటారు. ఇక క్షేత్ర స్థాయిలో ఎక్కువ భూమి ఉన్నా.. రికార్డులు సరిగా లేకపోవడం వల్ల పట్టా పాసు పుస్తకాల్లో తక్కువ భూమి రిజిస్ట్రేషన్ కావడం వంటి ఘటనలు చూస్తూనే ఉన్నాం. దీంతో రైతులు పంట పండించడం కంటే ఎక్కువగా భూరికార్డుల సవరణ కోసం అధికారుల చుట్టూ తిరగడమే ఎక్కువ అవుతోంది. ఇక గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌తో ఈ సమస్యలు మరిన్ని పెరిగాయని ఆరోపించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని సరిచేయడానికి భూభారతి పోర్టల్‌ను తీసుకువచ్చినట్లు చెబుతోంది. పైలట్ ప్రాజెక్టు కింద ఈ భూభారతి ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌ను అమలు చేసేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని 5 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి.. అమలు చేసేందుకు రెడీ అయింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం, నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో ఈ భూభారతి పోర్టల్ పైలట్ ప్రాజెక్టుగా గురువారం ప్రారంభమైంది. ఈ సమగ్ర భూభారతి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత.. నిజంగా ఉన్న భూమికి.. రికార్డుల్లో ఉన్న సమాచారం సరిగ్గా సరిపోతేనే భూ భారతి పోర్టల్లో భూమిని రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఇలా రిజిస్ట్రేషన్ అయిన తర్వాత రైతుకు పట్టాదార్ పాసు పుస్తకంతోపాటు భూధార్ నంబర్‌ను కూడా కేటాయిస్తారు. ఇలా చేయడం వల్ల భవిష్యత్‌లో ఆ భూమికి సంబంధించిన సర్వే నంబర్లను గానీ.. విస్తీర్ణాన్ని గానీ మార్చడానికి అవకాశమే ఉండదు. రాష్ట్రంలో భూముల వ్యవస్థను పకడ్బందీగా సరిచేసేందుకు రెవెన్యూ శాఖ ఈ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇక ఈ భూభారతిలో భాగంగా సర్వే, రిజిస్ట్రేషన్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్లను కలిపి ఒకే పోర్టల్ కిందికి తీసుకువచ్చారు. సర్వే వివరాలు.. స్టాంపులు-రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉన్న వివరాలు (22 ఎ, ఇతరత్రా), రెవెన్యూ శాఖ రికార్డుల్లో ఉన్న వివరాలు అన్నీ ఈ పోర్టల్లో అందుబాటులో ఉంచారు. మరోవైపు.. 2020 నవంబరు 2వ తేదీ నుంచి ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే అందులో ఏ సమాచారం ఉంటే దాని ఆధారంగానే భూముల రిజిస్ట్రేషన్ చేపట్టడంతో క్షేత్రస్థాయిలో భారీగా సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వీటన్నింటినీ సరిచేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఈ విధానంలో భూములను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఇక నుంచి భూమిని సర్వే చేయడం తప్పనిసరి చేశారు. ఇందు కోసం మొదట ఇంటిగ్రేటెడ్ పోర్టల్లో భూ సర్వేకు దరఖాస్తు చేసుకోవాలి. ఆ భూమికి సంబంధించిన రెవెన్యూ దస్త్రాలు, సర్వే శాఖ వద్ద ఉన్న వివరాలతో సరిహద్దు రైతులకు సర్వేయర్లు నోటీసులు ఇస్తారు. తోటి రైతుల సమక్షంలోనే భూమిని సర్వే చేసి తహసీల్దార్లకు రిపోర్టు అందిస్తారు. ఆ తర్వాత రెవెన్యూ శాఖ.. రైతుకు సర్వే పటం జారీ చేస్తుంది. ఆ సర్వే పటం ఆధారంగా భూ భారతి పోర్టల్లో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు రైతు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం క్షేత్రస్థాయిలో సర్వేలో ఎంత భూమి అయితే ఉంటుందో.. అంత భూమికే రిజిస్ట్రేషన్ చేస్తారు. రైతు చేసుకున్న దరఖాస్తుతోపాటు సర్వే పటం ఆధారంగా తహసీల్దార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కలిసి.. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్తి చేసి పట్టాదార్ పాసుపుస్తకాన్ని జారీ చేయనున్నారు. దీంతోపాటు రైతుకు భూధార్ కార్డును కూడా జారీ చేస్తారు. ఆ భూదార్ కార్డులో భూమికి సంబంధించిన సమగ్ర వివరాలను పొందుపరుస్తారు. భూదార్ కార్డులో ప్రత్యేక సంఖ్య ఉండటం వల్ల దాన్ని మార్చడానికి వీలు లేకుండా చేశారు. ఈ ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో రైతులే స్వయంగా భూమి నక్షా, భూమి మార్కెట్ విలువ సహా కీలక విషయాలను తెలుసుకునే అవకాశం కల్పించారు. ఇక తమ పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను కూడా కలుపుకుని.. చాలా మంది రైతులు పంట సాగు చేస్తూ ఉంటారు. ఇక అలాంటి భూములు కూడా రిజిస్ట్రేషన్ సమయంలో దొరికిపోనున్నాయి.

# కారులోనే యవ్వారం

ఛండీఘడ్, ఏప్రిల్ 9,

పంజాబ్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా పాకిస్థాన్ మద్దతుతో నడుస్తున్న ఒక అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ ముఠాను పంజాబ్ పోలీసులు చేధించారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 16.8 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుని, ఒక మహిళతో సహా నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. అరెస్ట్ అయిన వారిని బల్వీందర్ సింగ్(కపుర్తలా), సుమన్ ప్రీత్ కౌర్, హర్పాల్ సింగ్, జస్కరణ్‌బీర్ సింగ్(అమృత్‌సర్)గా గుర్తించారు. వీరు మారుతీ బలెనో కారులో డ్రగ్స్ తరలిస్తుండగా పోలీసులు పక్కా సమాచారంతో మాటు వేసి పట్టుకున్నారు. ఈ డ్రగ్స్ నెట్‌వర్క్ వెనుక పాకిస్థాన్, దుబాయ్ కేంద్రంగా పనిచేస్తున్న హ్యాండ్లర్ల హస్తం ఉందని ప్రాథమిక విచారణలో తేలినట్టు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. ఈ హెరాయిన్ నిల్వలను అమృత్‌సర్ సరిహద్దు ప్రాంతం నుంచి సేకరించి, చండీగఢ్‌లో డెలివరీ చేసేందుకు నిందితులు ప్లాన్ చేశారు. కాగా, నిందితుల వద్ద నుంచి డ్రగ్స్‌తో పాటు ఓ కారును కూడా స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఈ ముఠాకు ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయి? గతంలో ఇలాగే ఎన్నిసార్లు డ్రగ్స్ సరఫరా చేశారు? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

==============

# జనసేన నేత మోసం చేసాడు

## బాధిత మహిళ వీడియో

విజయవాడ్, ఏప్రిల్ 9, మరో జనసేన నేత రాసలీలలు బయటపడ్డాయి. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఎపిసోడ్ ఘటన మరవకముందే, తనను మోసం చేశాడంటూ మరో జనసేన నాయకుడి భాగోతం ఒక మహిళ బయట పెట్టింది.

పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం జడ్పీటీసీ జయప్రకాష్ నాయుడు తనను ఆర్థికంగా, శారీరకంగా వాడుకుని, చిత్రహింసలు పెడుతున్నాడని వీడియో విడుదల చేసింది.

తాను పవన్ కళ్యాణ్ అభిమానినని, పార్టీ కార్యక్రమాల కోసం వెళ్లినప్పుడు జయప్రకాష్ నాయుడు పరిచయమయ్యాడని, భర్త లేని నన్ను పెళ్లి చేసుకుని బాగా చూసుకుంటానని నమ్మించాడని మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. కొన్ని రోజుల తర్వాత మద్యం మత్తులో, గంజాయి మత్తులో తనను చితకబాదేవాడని, తనను కూడా గంజాయి సేవించమని ఒత్తిడి చేసేవాడని బాధిత మహిళ ఆరోపించింది. తనతో ఉండనని చెప్తే, నీ ఫోటోలు, వీడియోలు ఉన్నాయని బెదిరిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలంటూ కన్నీరు పెట్టుకుంటూ వీడియో విడుదల చేసింది.

# ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ని సందర్శించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

మెదక్, ఏప్రిల్ 09 (భారత శక్తి న్యూస్):

ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను సందర్శించి విద్యార్థుల తో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి వారికి అందిస్తున్నటువంటి భోజనము



మెనూ తరగతి గదులను, రిజిస్టర్లను పరిశీలించి అక్కడ ఉన్నటువంటి ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడి సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్ సి ఓ రెగ్యులర్ గా విజిట్ చేయడం వల్ల ఇలాంటి సమస్యలు రావని విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపి వారి కి భరోసా కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సారా రామ గౌడ్, కౌడిపల్లి బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో దూసుకుపోతున్న “లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పటల్”
# అందరిచూపు “లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పటల్” వైపే
## గుంటూరుకే తలమానికం “లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పటల్”

గుంటూరు, ఏప్రిల్ 9 (భారతశక్తి) : ఒకపుడు సంపన్నులకు, మెట్రో పాలిటన్ నగరాలకే పరిమితమైన అత్యాధునిక వైద్యసేవలు లలిత సూపర్ స్పెషాలిటీ వైద్యబృందం వెలకట్టలేని సేవలతో గుంటూరు జిల్లా ప్రజలకూ అందుబాటులోకి వచ్చాయి. గుంటూరు నగరంలో దశాబ్దాల కాలంగా ఈ హాస్పటల్ అత్యాధునిక వైద్యసేవలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. గతంలో సంపన్నులు, ఉన్నత వర్గాలకే పరిమితమైన వైద్యసేవలు గ్రామీణ నిరుపేదలకు సైతం అతి తక్కువ ధరలకే అందుబాటులోకి వచ్చాయి. వైద్యసేవలతో పాటుగా ఎందరో నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుంది.

గతంలో ప్రఖ్యాత మందుల తయారీ కంపెనీలు, ఇంప్లాంట్స్ తయారి కంపెనీలు తమ ప్రోడక్ట్స్ ను మార్కెట్లోకి విడుదల చేయాలంటే ముంబై, హైదరబాద్లోని డాక్టర్లను ఆశ్రయించేవారు. లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ యాజమాన్యం ఆపరిస్థితిని రూపుమాపింది. దేశ, విదేశీ కంపెనీలు తమ ఉత్పత్తులను మార్కెటింగ్కు గుంటూరు నగరానికే క్యూకడుతున్నారంటే అది ఈ హాస్పటల్ ఘనత అని చెప్పవచ్చు.

ప్రస్తుతం తక్కెళ్ళపాడు రోడ్డులో అన్ని హంగులతో నిర్మించిన లలిత హాస్పటల్లో అత్యాధునిక వైద్యసేవలు పేద, మధ్యతరగతి ప్రజలకు చేరువకావటంతో అందరిచూపు ఈ హాస్పటల్ వైపే చూస్తున్నారు.

లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పటల్కు అవార్డుల పంట :

దశాబ్దాల కాలంగా ప్రజాసేవలో పునీతమవుతున్న ఈ హాస్పటల్లో జాతీయ, అంతర్జాతీయ అవార్డుల పంట పండించుకుంది. ఇందుకు హాస్పటల్ అధినేతలు రాఘవశర్మ, విజయలు వెలకట్టలేని త్యాగం. సేవే తిరుగులేని నిదర్శనం. అత్యంత అనుభవజ్ఞులైన వైద్య బృందంతో కార్పోరేట్ వైద్యం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి



రావటంతో గుంటూరు నగరం హెల్త్ హబ్ గా మారనుంది.

# ఆదివాసీల అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా జాతర నిర్వహించాలి
## -తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు
## -జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ గా పల్లకొండ భాస్కర్ ఎంపిక

ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 09(భారతశక్తి): ఆదివాసీల అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా నాంచారమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించాలని తెలంగాణ ఆదివాసి ఏరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు అన్నారు. గురువారం ములుగు జిల్లా వెంకటాపూర్. మండలం రామానుజాపురం గ్రామంలో శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి సమక్షంలో జాతర ఉత్సవ కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా లోకిని రాజు మాట్లాడారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ఉత్సవ కమిటీ చైర్మన్గా నాంచారమ్మ జాతరను నిర్వహించామని ఈసారి యువ నాయకత్వానికి ఉత్సవ కమిటీ బాధ్యతలను అప్పగించడం జరుగుతుందన్నారు. మే 1 నుంచి జరిగే జాతరకు రాష్ట్రం నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి ఎరుకల కులస్తులు, భక్తులు హాజరవుతారని వారికి అన్ని రకాల వసతులు కల్పించేలా ఉత్సవ కమిటీ పని చేయాలని కోరారు. అందరినీ కలుపుకొని ముందుకు పోవాలని అప్పుడే జాతర విజయవంతం అవుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురికి సన్మానం చేశారు.

: మంత్రి సీతక్క సహకారంతో జాతరకు ఏర్పాట్లు :

మంత్రి సీతక్క సహకారంతో జాతరకు అన్ని రకాల ఏర్పాట్లు కల్పించేలా పనిచేస్తామని శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి అన్నారు. రామానుజాపూర్ గ్రామ పరిధిలో కాకతీయుల కాలంలో నిర్మించిన ఐదు శివలింగాలతో కూడిన పంచకూటాలయంగా పిలవబడే నాంచారమ్మ ఆలయం ఎంతో విశిష్టమైనదన్నారు. అభివృద్ధి పేరుతో విప్పి కుప్పపెట్టిన ఆలయాన్ని పునర్నిర్మించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని రకాల ఏర్పాట్లు కల్పించేలా అధికారులు పనిచేయాలని కోరారు. మే ఒకటి న జరిగే నాంచారమ్మ జాతరలో ప్రతి ఏడాది భక్తుల సంఖ్య పెరుగుతోందని, నాంచారమ్మ జాతర నిర్వహణలో ముందుండి నడిపించిన రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు కృషి అభినందనీయమన్నారు.

నాంచారమ్మ జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ గా పల్లకొండ



భాస్కర్

నాంచారమ్మ జాతర ఉత్సవ కమిటీ చైర్మన్గా పల్లకొండ భాస్కర్ ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడారు. ఆదివాసుల సంప్రదాయాలకు అనుగుణంగా జాతరను నిర్వహిస్తామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించేలా ఉత్సవ కమిటీ పని చేస్తుందని అన్నారు. తనకు మొదటిసారి అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజుకు ఇతర ఎరుకల కులస్తులు స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో రామానుజపురం గ్రామ

సర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ బుర్ర సమ్మయ్య ఉప సర్పంచ్ రావుల రవీందర్

ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనేటి రాజు, జిల్లా అధ్యక్షుడు కేతిరి బిక్షపతి, జిల్లా కోశాధికారి పాలకుర్తి సురేష్, భూపాల పల్లి జిల్లా అధ్యక్షుడు సుభాష్, తెలంగాణ ఆదివాసి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు అంగడి ప్రశాంత్ , మహిళా నాయకురాలు దేవరాయ రజిత తదితరులు ఉన్నారు.

# ప్రజా అభీష్టం మేరకే నల్తూర్ గ్రామంలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి సానుకూలం

–జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్ధన్ వెల్లడి


జిన్నారం మున్సిపల్, ఏప్రిల్ 09 (భారత శక్తి న్యూస్):

సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ నల్తూరు గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పై నిన్న కలెక్టర్ తో మాట్లాడిన విషయంపై ఈరోజు క్యాంపు కార్యాలయంలో పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కి జిన్నారం మున్సిపల్ నల్తూరులోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ కొనసాగించాలని జిన్నారం మున్సిపల్ చైర్మన్ నా కీర్తి జనార్ధన్ కౌన్సిలర్ ల ఆధ్వర్యంలో కలిసి మెమోరండం ఇవ్వడం జరిగింది. దీనికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సానుకూలంగా స్పందించి జిన్నారం మున్సిపల్ ప్రజలు ఎక్కడ కోరుకుంటే అక్కడే కొనసాగిస్తాను అని సానుకూలంగా స్పందించి మాట ఇవ్వడం జరిగింది, ఇట్టి విషయంపై జిన్నారం మున్సిపల్ చైర్మన్ న కీర్తి జనార్ధన్ మాట్లాడుతూ నల్తూరు గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణంలో అపోహలు అనుమానాలు పెంచుకోవద్దని ప్రజా ప్రజా అభీష్టం మేరకే స్కూల్ నిర్మాణం అభివృద్ధి దిశగా నల్తూర్ గ్రామం లోనే చేపడతామని ఈ సందర్భంగా వెల్లడించడం జరిగింది, కార్యక్రమంలో చైర్మన్ నకిర్తి జనార్ధన్ తో పాటు కౌన్సిలర్ ప్రభాకర్ రెడ్డి, బేలే కృష్ణ నాయకులు శంకరప్ప ఆదిరామకృష్ణ కొడకంచినాగరాజు పెద్దమ్మ గూడెం నాగరాజు మాజీ సర్పంచులు యాదయ్య శ్రీశైలం యాదవ్ నల్తూరు మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ కృష్ణ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఇసుక పంపిణీలో కట్టుదిట్టమైన చర్యలు: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 09 (భారత శక్తి): ములుగు జిల్లాలోని పది మండలాలలో నేటి నుండి మన ఇసుక వాహనం” అమలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు, స్థానిక గృహ నిర్మాణాలకు, ఇందిరమ్మ ఇండ్లుకు, ప్రభుత్వ చేపట్టిన నిర్మాణ అవసరాలకు కావలసిన ఇసుకను సరఫరా చేసేందుకు జిల్లా యంత్రాంగం ‘మన ఇసుక వాహనము” పేరుతో ఇసుక పాలసీని అమలులోకి తీసుకొని వచ్చిందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు.గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ప్రజలకు, ఇందిరమ్మ ఇండ్లుకు, ప్రభుత్వ చేపట్టిన నిర్మాణ అవసరాలకు ఇసుకను కనిష్ట ధరకు అందించడమే కాకుండా, ప్రైవేటు వ్యక్తులకు ఆస్కారం లేకుండా, అత్యంత పారదర్శకంగా నేరుగా ప్రభుత్వమే ఇసుకను వినియోగదారులకు సరఫరా చేయనుంది. ఇసుక రవాణాతో ఇబ్బందులు అదిగమించడంతో పాటు వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండ తగిన చర్యలు తీసుకోవడమైనదని జిల్లా కలెక్టరు, చైర్మన్, ఇసుక యాజమాన్య సంస్థ, ములుగు తెలుపడమైనది.రాష్ట్ర ప్రభుత్వము చేపట్టిన “మన ఇసుక వాహనం” అమలు మన ములుగు జిల్లా లోని 10 మండలలో అందుబాటులోకి వచ్చింది. జిల్లాలోని మొట్లగూడెం, పస్రా, రాఘవపట్నం, రంగాపూర్, సోమలగడ్డ (గోవిందరావుపేట మండలంలో) గ్రామాల్లో ఇసుక రీచ్లను ఏర్పాటు చేశారు. కాతిగూడెం, రాజుపేట, మరియు బోరెనర్సాపూర్ (మంగపేట మండలంలో); బుట్టాయిగూడెం (కన్నాయిగూడెం మండలంలో): దానవాయిపేట, వెంకటాపురం (జెడ్), మరియు వడగూడెం (జెడ్) (వెంకటాపురం మండలంలో); నర్సాపూర్, పంటాపూర్, ఉరట్టం, మేడారం, బొల్లేపల్లి, రంగాపూర్, మరియు కాల్వపల్లి (ఎస్.ఎస్. తాడ్వాయి మండలంలో); మరియు కొండాయి మరియు మానసపల్లి (ఏటూరునాగారం మండలంలో) ఇట్టి ఇసుక రీచ్ లను ఇసుకను గృతించి ‘మన ఇసుక వాహనం”. ఆన్ లైన్ వెబ్ సైట్ పొదుపరచడం జరిగింది.ఇసుక కావలసిన వినియోగదారులు, ఆన్ లైన్ వెబ్ సైట్ (ష్ట్రజూం:// ‾ంఎఅజ.ఎ్తస్త్ర.స్త్రశీజ.అఅ) నందు వారి వివరములను నమోదు చేసుకొని, కావలసిన ఘనపరిమాణానికి ఇంటర్నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ లేదా యూపీఐ ద్వారా చెల్లింపులు చేసి ఇసుకను నేరుగా ఇంటి వద్దే పొందవచ్చు. జిల్లా యంత్రాంగం ఇసుక రవాణా చేయాల్సిన దూరాన్ని బట్టి ధర నిర్ణయించినారు. ఇసుక సరఫరా సమాచారం కొరకు స్థానిక తహసిల్దార్ని సంప్రదించవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, డి ఆర్ డి ఓ చంద్ర శేఖర్ రెడ్డి, ఏ డి మైన్స్ జయ రాజు, పి డి హౌసింగ్ సూర్య నారాయణ, ఇర్రిగేషన్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపి డి ఓ లు, పంచాయతీ



# జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి నివాసానికి కేటీఆర్

జగిత్యాల, ఏప్రిల్ 9( భారత శక్తి ప్రతినిధి ):

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు మాజీ మంత్రి జీవన్ రెడ్డి నివాసానికి స్వయంగా వెళ్లి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తాను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సూచన మేరకే జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించడం జరిగిందని ఆయన తెలిపారు. జీవన్ రెడ్డి కి నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నదని ఆయనకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఆయన తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ ఎల్.రమణ,మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఎలాంటి సమస్యలు వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలి

## దానిని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ - తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి) ఏప్రిల్ 9:



ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్ తెలిపారు.గురువారం సూర్యాపేట రూరల్ మండలం ఎర్కారం గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తో కలిసి కలెక్టర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. తదుపరి పత్రికా విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 281 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని,వడ్ల మిల్లులను కూడ గుర్తించడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలకు వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 4 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రావచ్చని, ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో బేసిక్ మౌలిక సదుపాయాలైన వేయింగ్ మిషన్లు, మాయిశ్చరైజింగ్ మిషన్లు, త్రాగునీరు, టెంట్లు, వర్షాలు వస్తే అత్యవసరం పరిస్థితులలో టార్బులిన్ పట్టాలు, ట్యాజింగ్ మిషన్లు, సన్న వడ్ల కొనుగోలు కేంద్రాలలో కాలిబర్ స్కేల్స్ ఏర్పాటు చేశామని, 2,3 మండలాలకు కలిపి ఒక ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ను ఏర్పాటు చేశామని , జిల్లాస్థాయిలో కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని దీనిని జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ జిల్లాస్థాయిలో ధాన్యం కొనుగోలును పర్యవేక్షిస్తారని అలాగే మండల స్థాయిలో ధాన్యం కొనుగోలు కమిటీని ఏర్పాటు చేశామని వీరు ఆయా మండలాల పరిధిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తారని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే కాంటాలు వేయాలని సూచించారు. అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులను ముందుగానే అప్రమత్తం చేయాలని తెలిపారు. ఆలస్యం లేకుండా 2--3 రోజుల్లో వరి ధాన్యానికి కాంటాలు పూర్తి చేయాలని ఆదేశించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని పిఎసిఎస్ అధికారులను కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారులు మోహన్ బాబు, శ్రీధర్, జిల్లా కోపరేటివ్ అధికారి ప్రవీణ్, అధికారులు పిఎసిఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పి నరసింహ

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 9:



వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, సూచనలు పాటించాలి.వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ ను అనుసరించాలి అవగాహన కల్పించాలని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసులను ఎస్పి నరసింహ ఐపిఎస్ ఆదేశించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ దృశ్య పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు ట్రాఫిక్ పునరుద్ధరణ, ట్రాఫిక్ నియంత్రణ చేస్తూ ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతుందని అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్నటువంటి ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాట్లకు సంభందించి కొత్త బస్టాండ్ వద్ద సంబంధిత అధికారులతో కలిసి ఈరోజు ఎస్పి పరిశీలించారు. బస్టాండ్ ప్రాంగణంలో రహదారులపై ఉన్న ట్రాఫిక్ రద్దీని, రోడ్ల వెంబడి నిర్వహిస్తున్న వ్యాపార సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు సలహాలు అందించారు. ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాట్ల పనులను వేగంగా పూర్తి చేయాలని, మున్సిపల్ శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించేలా ప్రజలను వాహనదారులను ముందస్తుగా అప్రమత్తం చేయాలని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ పునరుద్ధరణకు సంబంధించి అన్ని రకాల చర్యలను తీసుకోవాలని, ఆర్టీసీ అధికారులను సంప్రదించి జిల్లా కేంద్రంలో, కొత్త బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సుల రాకపోకలు, మార్గాలను సులభతరం చేయాలని తెలిపారు. సూర్యాపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి పోలీస్ సిబ్బందిని బలోపేతం చేస్తామని అన్నారు.వాహనదారులు ట్రాఫిక్ నియమాలు రోడ్డు నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలకు గురవకుండా సురక్షితంగా గమ్యం చేరుకోవాలని అన్నారు. వ్యాపారస్తులు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించకూడదని దీనివల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమం నందు స్థానిక డిఎస్పి ప్రసన్నకుమార్, ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం ఉన్నారు

# నేడు ప్రజా దర్బార్ లో పాల్గొననున్న మంత్రి

ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 09 (భారత శక్తి): వెంకటాపురం మండల కేంద్రంలో నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమంలో రాష్ట్రపంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) హాజరుకానున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



ములుగు జిల్లా వెంకటాపురం మండలం తహసిల్దార్ కార్యాలయంలో నేడు (శుక్రవారం) మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆధ్వర్యం లో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించబడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర మంత్రి సీతక్క అర్జున్ రెడ్డి స్వీకరించను న్నారని, వెంకటాపురం, వాజేడు, మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరు నాగారం మండలాలకు చెందిన ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు.

ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని కోరారు

ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్ పి, డి ఎఫ్ ఓ, ఆర్డీఓ అన్ని శాఖల జిల్లా అధికారులు, ఐటిడిఏ ఏటూరు నాగారం కార్యాలయ అధికారులు, సంబంధత మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

# మహిళా సాధికారత కోసమే మిషన్ శక్తి పథకం:టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

## -లబ్ధిదారులకు కుట్టు యంత్రాలు పంపిణి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 9 :




కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ శక్తి పథకం మహిళ సాధికారత కోసమేనని టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని బాలసదనంలో జరిగిన బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి తో కలిసి కలెక్టర్ ప్రావీణ్య మిషన్ శక్తి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ పథకం కింద 50 మంది లబ్ధిదారులకు కుట్టు యంత్రాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. మరో 25 మంది లబ్ధిదారులకు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలు ఒంటరి మహిళలు వితంతువులు చదువు మధ్యలో మానేసిన మహిళలు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వనితా సంతోష్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సిడిపివో చంద్రకళ, డిసిపిఓ రత్నం, చిల్డ్రన్ సూపర్డెంట్ విజయ కౌన్సిలర్లు రమేష్, అశ్విన్ నాయకులు శాంతికుమార్ తదితరులు లబ్ధిదారులు మహిళలు పాల్గొన్నారు.

# వయోవృద్ధులు, స్త్రీ, శిశు, మాత సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

## పోషన్ పక్వాడ కార్యక్రమం ప్రారంభించిన మంత్రి

## క్షేత్రస్థాయిలో అంగన్వాడి సేవల బలోపేతానికి మొబైల్ ఫోన్లో పంపిణీ

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 09 (భారత శక్తి ):దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వయోవృద్ధులు, స్త్రీ, శిశు, మాత సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర మంత్రి పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క)అన్నారు.

ఏప్రిల్ 9 నుండి ఏప్రిల్ 23 వరకు పోషన్ పక్వాడ కార్యక్రమం, జిల్లా నుండి రాష్ట్ర మంత్రి పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క)ప్రారంభించారు.

గురువారం మహబూబాబాద్ పట్టణంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను ప్రారంభించారు, వృద్ధుల సంరక్షకులకు జీవనశైలి మెరుగుపడడం కోసం ఉపయోగపడుతుందని వారి యొక్క ఒంటరితనాన్ని పోయి సంతోషంగా ఉండటం కోసం రూపొందించబడిన ఈ కేంద్రం ద్వారా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలోని వయోవృద్ధులు వివిధ క్రీడలలో పాల్గొనవచ్చని, తద్వారా మానసిక ప్రశాంతతబి ఉల్లాసంగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని,

జిల్లాలో సుమారు 12 లక్షల వ్యయంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ కేంద్రం నిర్వహించడం జరుగుతుందన్నారు,

వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పిల్లలు ప్రేమగా చూసుకోవాలని, వారిని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో వదిలేయడం తగదని సూచించారు. ప్రభుత్వం వృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు.

ఈ కేంద్రంలో టీవీ, దినపత్రికలు మ్యాగజీన్, పాటల పోటీలో క్యారమ్స్, చెస్, మొదలగైన ఆటలు అందుబాటులో ఉంటాయని, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో కేంద్రంలో ప్రథమ చికిత్స ఆరోగ్య సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందని, ప్రతి వారానికి ఒకసారి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్య స్థితిగతులను గమనిస్తూ ఉంటారని, వారి యొక్క ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మల్టీ గ్రైన్ ఆల్ఫా ఆహార పదార్థాలతో అందించడం జరుగుతుందని తెలిపారు,

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ బలోపేతం కోసం రాష్ట్రవ్యాప్తంగా వయవృద్ధులు గర్భిణీలు బాలింతలు చిన్నపిల్లలకు వివిధ పథకాలను ప్రవేశపెట్టి వారి సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని అందులో భాగంగానే జిల్లాలోని అంగన్వాడీ టీచర్లకు (1368) మొబైల్ ఫోన్ల పంపిణీ చేయడం జరిగిందని తద్వారా క్షేత్రస్థాయిలో డిజిటల్ విధానంలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే పథకాలు పౌష్టిక ఆహారం, స్థితిగతులు ఎప్పటికప్పుడు ఆన్లైన్ ద్వారా అప్లోడ్ చేయడం పారదర్శకంగా పాలన కొనసాగుతుందన్నారు,

పోషణ్ పఖ్వాడా కార్యక్రమాన్ని మహబూబాబాద్ కేంద్రంగా ఈరోజు నుండి ప్రారంభించారు, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే పౌష్టికాహార పంపిణీపై



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలు, ఆహార పంపిణీ అంశాలను నమోదు చేయవచ్చని, దీని ద్వారా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం పోషణ్ పఖ్వాడా కార్యక్రమం లక్ష్యమని, ఈ కార్యక్రమం ఈ నెల 9 నుంచి 23 వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగుతుందని మంత్రి పేర్కొన్నారు.

మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం చరిత్రత్మకమైన నిర్ణయం తీసుకొని శాసనసభలో వృద్ధుల సంక్షేమ చట్టం ప్రవేశపెట్టి అమలుపరచినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు,

మహబూబాబాద్ లో డే కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని, రిటైర్డ్ ఉద్యోగులు వయవృద్ధుల కోసం ఇక్కడ వెల్నెస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని మంత్రి గారిని కోరారు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, సభను ఉద్దేశించి ప్రసంగించి అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో జిల్లా యంత్రాంగం ప్రజా ప్రతినిధులు ముందుకు సాగుతారని అన్నారు,

జిల్లా అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ కె. అనిల్ కుమార్, జిల్లా వెల్ఫేర్ అధికారిని సబిత, సిడిపిఓలు శిరీష, సంబంధిత విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.వివరాలు, ఆహార పంపిణీ అంశాలను నమోదు చేయవచ్చని, దీని ద్వారా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం పోషణ్ పఖ్వాడా కార్యక్రమం లక్ష్యమని, ఈ కార్యక్రమం ఈ నెల 9 నుంచి 23 వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగుతుందని మంత్రి పేర్కొన్నారు.మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం చరిత్రత్మకమైన నిర్ణయం తీసుకొని శాసనసభలో వృద్ధుల సంక్షేమ చట్టం ప్రవేశపెట్టి అమలుపరచినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, మహబూబాబాద్ లో డే కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని, రిటైర్డ్ ఉద్యోగులు వయవృద్ధుల కోసం ఇక్కడ వెల్నెస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని మంత్రి గారిని కోరారు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, సభను ఉద్దేశించి ప్రసంగించి అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో జిల్లా యంత్రాంగం ప్రజా ప్రతినిధులు ముందుకు సాగుతారని అన్నారు, జిల్లా అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ కె. అనిల్ కుమార్, జిల్లా వెల్ఫేర్ అధికారిని సబిత, సిడిపిఓలు శిరీష, సంబంధిత విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గాయపడిన పాత్రికేయుడిని పరామర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల , ఏప్రిల్ 9 ( భారత శక్తి ప్రతినిధి):



బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాల పర్యటనలో భాగంగా జరిగిన తోపులాటలో మీడియా ప్రతినిధి అయినా ౹ు న్యూస్ రిపోర్టర్ సాయి తీవ్రంగా గాయపడి కాలు విరగడం జరిగింది . వెంటనే ఆయనను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్న సమయంలో విషయం తెలుసుకున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో కలిసి జగిత్యాలలోని ఆస్పత్రికి వెళ్లి బాధితుడు సాయిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గాయపడిన సాయికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ అంకిత్

## -పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు



భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 09 (భారతశక్తి): కొత్తగూడెంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను కలెక్టర్ అంకిత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో జరుగుతున్న లెవెలింగ్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్ ద్వారా భవనాల రూపకల్పన, విభాగాల వారీగా ఏర్పాటు చేయనున్న సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు అందించనున్న తరగతి గదులు, లైబ్రరీలు, బ్లాక్ రహదారులు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుపై వివరాలు తెలుసుకున్నారు. నిర్మాణ పనులు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి అయ్యేలా వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బంది, యంత్ర సామగ్రి ఏర్పాటు చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల పురోగతిపై ప్రతిరోజూ నివేదికలు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అత్యుత్తమ సౌకర్యాలతో పాఠశాల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా



## కోర్టుకెక్కిన హన్సిక.. వదినపై రూ.2 కోట్ల దావా

ప్రముఖ సినీ నటి హన్సిక మోత్వాని, తన వదిన, టీవీ నటి ముస్కాన్ నాన్సీ జేమ్స్‌పై రూ.2 కోట్ల పరువునష్టం దావా వేశారు. తనపై, తన సోదరుడు ప్రశాంత్ మోత్వానిపై ముస్కాన్ గృహ హింస ఆరోపణలు చేయడంతో తన ప్రతిష్ఠకు భంగం కలిగిందని ఆరోపిస్తూ హన్సిక ముంబై సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆమె తరపున న్యాయవాది అద్నాన్ షేక్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ ప్రకారం తన సోదరుడు ప్రశాంత్‌తో వివాహ సమయంలో ముస్కాన్ రూ.27 లక్షలు అప్పుగా తీసుకున్నారని, దాన్ని తిరిగి చెల్లించకుండా తప్పించుకోవడానికే సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని హన్సిక పేర్కొన్నారు. తన సోదరుడి వైవాహిక జీవితంతో తనకు పరిమిత ప్రమేయం మాత్రమే ఉందని, వారు నివసించే ఇంట్లో తాను లేనని స్పష్టం చేశారు. గతంలో ముస్కాన్.. తన భర్త ప్రశాంత్‌తో పాటు హన్సికపై కూడా వేధింపులు, గృహ హింస ఆరోపణలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాహ సమయంలో ఖరీదైన బహుమతులు డిమాండ్ చేశారని, వారి వేధింపుల వల్లే తనకు బెల్స్ పాల్సీ (ముఖ పక్షవాతం) వచ్చిందని ఆమె ఎఫ్ఐఆర్‌లో ఆరోపించారు. ఈ ఆరోపణలను హన్సిక పూర్తిగా ఖండించారు. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఆమె గతంలో బాంబే హైకోర్టును ఆశ్రయించారు. తాజా పరువునష్టం దావాలో భాగంగా ముస్కాన్ తనకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో ఎలాంటి ఆరోపణలు చేయకుండా ఆమెను నిలువరించాలని కోర్టును హన్సిక కోరారు. సివిల్ దావాతో పాటు, భారతీయ న్యాయ సంహిత కింద అంధేరిలోని మెజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ పరువునష్టం కేసు కూడా దాఖలు చేశారు. ప్రశాంత్, ముస్కాన్ 2020లో వివాహం చేసుకోగా, 2022 నుంచి విడిగా ఉంటున్నారు. దిండోషి సెషన్స్ కోర్టులో ఈ పరువునష్టం దావా త్వరలో విచారణకు రానుంది.




## పెళ్లి పీటలెక్కబోతున్న బెల్లంకొండ సాయి శ్రీనివాస్.. ముహూర్తం ఖరారు!

టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలోనే ఒక ఇంటివాడు కాబోతున్నాడు. ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె కావ్య రెడ్డితో ఆయన వివాహం నిశ్చయమవడమే కాకుండా, పెళ్లి ముహూర్తం కూడా ఖరారైంది. ఇటీవల ఇరు కుటుంబాల సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో శ్రీనివాస్ కావ్య రెడ్డిల 'లగ్నపత్రిక' వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలను సాయి శ్రీనివాస్ సోషల్ మీడియాలో పంచుకోవడంతో, అవి చూసిన అభిమానులు ఈ జంట "చూడముచ్చటగా ఉంది" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ లగ్నపత్రిక వేడుకలోనే వివాహ ముహూర్తాన్ని ఏప్రిల్ 29గా ఖరారు చేశారు. టాలీవుడ్‌లోని ప్రముఖులు, రాజకీయ నేతలు, ఇతర రంగాల సెలబ్రిటీల సమక్షంలో ఈ పెళ్లి వేడుకను ఘనంగా నిర్వహించేందుకు బెల్లంకొండ సురేశ్ కుటుంబం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఒకవైపు వ్యక్తిగత జీవితంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్న శ్రీనివాస్... మరోవైపు సినిమాల పరంగానూ బిజీగా ఉన్నాడు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న అడ్వెంచర్ థ్రిల్లర్ 'హైందవ'పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు ఉన్నాయి. లుధీర్ బైరెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

## ఎమోషన్ తో యాక్షన్ లోకి దిగిపోయే 'డెకాయిట్'

యాక్షన్ థ్రిల్లర్ సినిమాలతో ఎక్కువ మార్కులు కొట్టేసే హీరోల జాబితాలో అడివి శేష్ పేరు తప్పకుండా కనిపిస్తుంది. ఈ జోనర్ పై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టడం .. ఆ తరహా పాత్రలలో రాణించడమే అందుకు కారణమని చెప్పుకోవాలి. ఆయన హైట్ .. ఫిట్ నెస్ .. చురుకైన చూపులు .. ఈ తరహా పాత్రలకు ప్రధానమైన బలంగా నిలుస్తున్నాయి. అలాంటి అడివి శేష్ తాజా చిత్రంగా రూపొందినదే 'డెకాయిట్'. 'ఒక ప్రేమకథ' అనేది ట్యాగ్ లైన్. షానియల్ డియో దర్శకత్వం వహించిన ఈ సినిమాకి, సుప్రియ యార్లగడ్డ నిర్మాతగా వ్యవహరించారు. అడివి శేష్ జోడీగా మృణాల్ ఠాకూర్ కనిపించనుంది. ఇక విలన్ పాత్రలో అనురాగ్ కశ్యప్ నటన ఈ సినిమాకి హైలైట్ గా నిలుస్తుందనే టాక్ బలంగా వినిపిస్తోంది. ఇతర కీలమైన పాత్రలలో ప్రకాశ్ రాజ్ .. సునీల్ .. కామాక్షి భాస్కర్ల కనిపించనున్నారు. లవ్ .. యాక్షన్ .. ఎమోషన్ ప్రధానంగా నడిచే ఈ సినిమా, రేపు థియేటర్లకు రానుంది. కరోనా కాలంలో .. ఆసుపత్రి మాఫియా నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని చెబుతున్నారు. ఆసుపత్రులు డిమాండ్ చేసిన డబ్బును సంపాదించడం కోసమే హీరో డెకాయిట్ గా మారతాడని అంటున్నారు. యాక్షన్ కీ .. ఎమోషన్ కి మధ్య నడిచే సున్నితమైన లవ్ స్టోరీ యూత్ ను ఆకట్టుకుంటుందని చెబుతున్నారు. విజువల్స్ పరంగా .. నేపథ్య సంగీతం పరంగా ఈ సినిమా ఆడియన్స్ కి ఒక గొప్ప ఫీలింగ్ ను కలిగిస్తుందని అంటున్నారు. ఈ సినిమాతో అడివి శేష్ కి మరో హిట్ దొరుకుతుందేమో చూడాలి.



## రేణు దేశాయ్‌పై అసభ్యకర కామెంట్.. గుంటూరు వ్యక్తి అరెస్ట్



నటి రేణు దేశాయ్ సోషల్ మీడియా రీల్‌పై అసభ్యకరమైన, అభ్యంతరకరమైన వ్యాఖ్య పోస్ట్ చేసినందుకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ఓ వ్యక్తిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న వేధింపులపై రేణు దేశాయ్ ఇటీవల చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. చెన్నయ్య రుంజాల అనే వ్యక్తి తన యూట్యూబ్ ఖాతా నుంచి రేణు దేశాయ్ రీల్‌ను చూసి, దానిపై అనుచిత వ్యాఖ్య చేసినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు తమ దర్యాప్తులో గుర్తించారు. నిందితుడు గుంటూరులో ఉన్నట్లు తెలుసుకుని, అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకుని గచ్చిబౌలిలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో నిందితుడు తన ఫోన్ నుంచే ఆ కామెంట్ పెట్టినట్లు అంగీకరించాడు. ఆన్‌లైన్‌లో తనపై అసభ్యకరంగా మాట్లాడుతున్న వారిపై, తన వ్యక్తిగత జీవితంలోకి చొరబడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రేణు దేశాయ్ ఈ నెల ప్రారంభంలో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో విడాకులైనప్పటి నుంచి తాను వేధింపులు ఎదుర్కొంటున్నానని ఆమె గతంలో తెలిపారు.



## సమంత ధైర్యం 'ఆయనే'!

నటి సమంత తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితం గురించి పంచుకున్న భావోద్వేగపూరిత వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఎన్నో సవాళ్లను దాటుకుని కెరీర్‌లో దూసుకుపోతున్న సమంత, తన భర్త రాజ్ నిడమోరు తన జీవితంలో ఎంతటి కీలక పాత్ర పోషించారో వివరిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. తన జీవితంలోని ఒడిదుడుకుల సమయంలో రాజ్ తనకు అండగా నిలిచారని సమంత పేర్కొన్నారు. "నేను ఈ రోజు ఇంత ధైర్యంగా ఉండటానికి, ఒక మంచి నటిగా ఎదగడానికి ప్రధాన కారణం ఆయనే" అని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. తనలోని నైపుణ్యాన్ని మెరుగుపరచడంలో రాజ్ నిరంతరం ప్రోత్సహిస్తారని వెల్లడించారు. తామిద్దరం వృత్తిపరమైన పనులే కాకుండా, వర్కవుట్స్ వంటి వ్యక్తిగత పనులను కూడా కలిసే చేస్తామని సమంత చెప్పారు. ఒక్క రోజు కూడా ఆయనకు దూరంగా ఉండలేనంతగా తమ మధ్య అనుబంధం ఉందని తన ప్రేమానురాగాలను చాటుకున్నారు. ప్రస్తుతం సమంత.. రాజ్ నిర్మాణంలో వస్తున్న 'మా ఇంటి బంగారం' అనే సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంటూనే, తన విజయానికి మూలస్తంభంగా నిలిచిన భర్త గురించి సమంత గొప్పగా చెప్పడం ఆమె అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వీరి జోడీ వృత్తిపరంగా, వ్యక్తిగతంగా మరిన్ని విజయాలు అందుకోవాలని నెటిజన్లు ఆకాంక్షిస్తున్నారు.

## షూటింగ్‌కు గ్యాప్... కిచెన్‌లో గరిటె తిప్పిన శ్రుతి హాసన్!

నటిగా, గాయనిగా బహుముఖ ప్రజ్ఞ చాటుకుంటున్న శ్రుతి హాసన్, అప్పుడప్పుడు వంటగదిలో గరిటె తిప్పుతూ తనలోని మరో కోణాన్ని అభిమానులకు పరిచయం చేస్తుంటారు. తాజాగా ఈ సలార్ బ్యూటీ తనలోని పాకశాస్త్ర నైపుణ్యాన్ని మరోసారి బయటపెట్టారు. ఎంతో రుచికరమైన అంబూర్ బిర్యానీతో పాటు కథిరికాయ్ (వంకాయ) కర్రీని ఇంట్లోనే సిద్ధం చేశారు. ఈ వంటకాల ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్న శ్రుతి.. "ఇంట్లో చేసిన అంబూర్ బిర్యానీ, కథిరికాయ్ కర్రీ... నాలోని కుక్ మళ్లీ వచ్చేసింది" అని క్యాప్షన్ జోడించారు. శ్రుతి ఇలా వంటకాలు చేయడం ఇదే మొదటిసారి కాదు. గత మార్చిలో కూడా షూటింగ్ నుంచి విరామం దొరకడంతో ఓ సరికొత్త స్నాక్ రెసిపీని ప్రయత్నించారు. వెనిలా గ్రీక్ యోగర్ట్‌లో ఖర్జూరాలు, కొద్దిగా ఉప్పు, ఆలివ్ ఆయిల్ వేసి తయారు చేసిన ఆ స్నాక్ వీడియోను పంచుకున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, శ్రుతి ప్రస్తుతం ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'సలార్ పార్ట్ 2: శౌర్యాంగ పర్వం'లో హీరోయిన్‌గా కనిపించనున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన 'సలార్: పార్ట్ 1 - సీజ్‌ఫైర్' గత ఏడాది విడుదలై భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ రెండో భాగాన్ని కూడా ప్రశాంత్ నీల్ డైరెక్ట్ చేస్తుండగా, హోంబలే ఫిల్మ్స్ నిర్మిస్తోంది.



# విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను నేర్పించాలి

జగిత్యాల, ఏప్రిల్ 9 (భారత శక్తి ప్రతినిధి): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి గ్రామం లోని తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేసశారు. మాడల్ స్కూల్ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను నేర్పించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్. గురువారం రోజున వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలను మొత్తం సందర్శించి విద్యార్థుల స్థితిగతులను, వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల తీరును కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ తెలంగాణ మోడల్ స్కూల్ చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. క్లాస్ రూమ్ లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు అని కలెక్టర్ ఆరా తీశారు. అదే విధంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అని కలెక్టర్ హాజరు పట్టికను పరిశీలించారు. పాఠశాలలోని ప్రతీ విద్యార్థి పై ప్రత్యేక దృష్టి సారించాలని, సర్కారు బడుల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని,



భావి తరాలకు అవసరమైన విద్యా బోధన చేయడం జరుగుతున్నదని తెలిపారు. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వంద శాతం ప్రగతి సాధించే విధంగా విద్యా బోధనకు కృషి చేయాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణ, మరియు పరిసరాల పారిశుద్ధ్య సౌకర్యాలు వంటి అంశాలను పరిశీలించారు.. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అనే విషయాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, భోజన తయారీ విషయంలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల తరగతి గదులలో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించి, శానిటేషన్ చేయించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతలను, కిచెన్ షెడ్ లను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన తప్పకుండా పాటించాలని చెప్పడం జరిగింది. ఈ తనిఖీలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి కె.రాము, డిఆర్డిఓ పీడీ రఘువరన్, ఎమ్మార్వో , ఎంపిడిఓ, గ్రామ సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారస్తుల జోలికి వెళ్ళవద్దు
### : టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డి, ఏప్రిల్ 9 (భారత శక్తి ప్రతినిధి): పట్టణంలోని రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న పేదల జోలికి ప్రజా ప్రతినిధులు అధికార యంత్రాంగం వెళ్లవద్దని టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కోరారు. రోడ్డు పక్కన జీవనోపాధి కోసం వివిధ చిరు వ్యాపార సముదాయాలు నిర్వహించుకుంటూ బతుకుతున్న వారిని నిబంధనల పేరిట ఇబ్బందులకు గురి చేయవద్దని ఒకవేళ ఏమైనా చర్యలు తీసుకోవాల్సి వస్తే తన దృష్టికి తీసుకురావాలని జగ్గారెడ్డి అధికారులను విజ్ఞప్తి చేశారు.



## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 09: కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాంను గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తనిఖీ చేశారు. ప్రతీ నెల నిర్వహించే నియమిత తనిఖీలలో భాగంగా ఈవీఎం (ఈవిఎం) గోదాంను సందర్శించి పరిశీలించారు. గోదాంలో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, డబుల్ లాక్ సిస్టమ్, ఫైర్ సేఫ్టీ పరికరాలు తదితర అంశాలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరచిన ఈవీఎంల స్థితి, నిర్వహణ విధానం, రికార్డుల నిర్వహణపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ఎలాంటి లోపాలు లేకుండా పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. అనంతరం వాటర్ ట్యాంక్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓ ఎన్ వి గిరి, తహసీల్దార్ హిమబిందు, రెవెన్యూ, సిబ్బంది పాల్గొన్నారు.




## ఘనంగా కామారెడ్డి పట్టణంలో ఎన్ ఎస్ యు ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహణ

కామారెడ్డి, ఏప్రిల్ 09 (భారత శక్తి ప్రతినిధి): కామారెడ్డి పట్టణంలో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ ఎస్ యు ఐ) 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆదేశాల మేరకు ఎన్ ఎస్ యు ఐ ను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు ఐరేణి సందీప్ ఆధ్వర్యంలో కామారెడ్డి నియోజకవర్గ కార్యాలయం వద్ద ఎన్ ఎస్ యు ఐ జెండాను ఎగరవేశారు. అనంతరం కామారెడ్డి డైరీ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి ఎన్ ఎస్ యు ఐ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఐరేణి సందీప్ మాట్లాడుతూ, 1971లో మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ నేతృత్వంలో ఎన్ ఎస్ యు ఐ స్థాపించబడిందని తెలిపారు. విద్యార్థుల హక్కులు, సంక్షేమం కోసం ఈ సంస్థ నిరంతరం పోరాటం చేస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ఎన్ ఎస్ యు ఐ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషి ని కొనియాడారు. వారి మార్గదర్శకత్వంలో విద్యార్థి ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జిల్లా నాయకులు అందుగుల అనిల్, రోషన్, శ్యామ్ టింకు, విద్యార్థులు రంజిత్, విజయ్, సంజయ్, అనీష్, రోహిత్, సుజిత్, కుశాల్, అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

* అక్రిడిటేషన్లు,ఇండ్లస్థలాలు,ఇండ్లు
* హెల్త్ కార్డులివ్వాలి
* సమిష్టిగా ఉండి... సమస్యలపై పోరాడాలి
* టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. దయాసాగర్



## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

భూపాలపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 9 (భారత శక్తి). సమిష్టిగా ఉండి సమస్యలపై పోరాడి ఇండ్ల స్థలాలు, ఇండ్లు, అక్రిడిటేషన్ కార్డులుసాధించుకోవాలనీ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి. దయాసాగర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షులు ఎర్రం సతీష్ కుమార్ అధ్యక్షత వహించగా దయాసాగర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ...

**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా**

జర్నలిస్టులకు జీతభత్యాలు లేకుండా 24 గంటలు నిద్రాహారాలు మాని ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ పనిచేస్తున్నారన్నారు. జర్నలిస్టులు ఆర్థికంగా అభివృద్ధి చెందడం లేదని , జర్నలిస్టు ఆరోగ్య భద్రత లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు మరణిస్తే వారి కుటుంబానికి మీడియా అకాడమీ నుండి కేవలం లక్ష రూపాయలు మాత్రమే అందించి చేతులు దులుపుకుంటున్నారని ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు . మృతిచెందిన జర్నలిస్టు భార్యకు కేవలం 3వేల పెన్షన్ అందిస్తున్నారని ఇకనుండి 5వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు జారీ చేసిన హెల్త్ కార్డులు పనిచేయకుండా పోయాయని పని ఒత్తిడి వలన అనేక మంది జర్నలిస్టులు అనారోగ్యం పాలవుతురనితెలిపారు. జర్నలిస్టులతో పాటు వారి కుటుంబాల ఆరోగ్య పరిస్థితులు గాలిలో దీపంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలికంగా పనిచేస్తుందన్నారు. పాత్రికేయుల అభివృద్ధి, సంక్షేమమే ఏజెండాగా కృషి చేస్తుందన్నారు. సుదీర్ఘంగా పెండింగ్ లో ఉన్న ఇండ్లస్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, రిటైర్డ్ జర్నలిస్టులకు పింఛన్లు, మహిళా జర్నలిస్టులకు రాత్రి పూట రవాణా సౌకర్యం తదితర సమస్యలపై ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు చేస్తూ వినతిపత్రాలు, దరఖాస్తులు ఇస్తూ ముఖ్యమంత్రి, మంత్రులు, కలెక్టర్ల దృష్టికి తెస్తుందన్నారు. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల పిల్లలకు కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఫీజు రాయితీ కల్పించడం లేదనీ, కావున అట్టి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కమిటీలలో ఉన్న బాధ్యులు, సభ్యులు యూనియన్ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని, అదే విధంగా బాధ్యతతో వ్యవహరించి స్థానిక జర్నలిస్టుల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. అందరూ ఐక్యతతో హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. సమన్వయంతో పని చేసి సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ 2026 నూతన డైరీ నీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుజ్ సారేశ్వరరావుమ,జాతీయ కౌన్సిల్ సభ్యులు కొలుగూమరి సంజీవరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చింతల కుమార్ యాదవ్, గాదె రమేష్, రోంటా ల శంకర్,జిల్లా ఉపాధ్యక్షులు ములకల లక్ష్మారెడ్డి,కోశాధికారి మండల రాంబాబు, జాయింట్ సెక్రెటరీ టి. దుర్గయ్య,సలహాదారు నామాల రమేష్, తెలంగాణ బ్రాడ్ కాస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ప్రవీణ్ కుమార్,కార్యదర్శి కమలాకర్, కోశాధికారి భాస్కర్, మీడియా కన్వీనర్ పుల్ల సృజన్, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, రహీం పాషా, జోవర్ధన్,తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మత విద్వేషాలకు బ్రేక్... ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్లు డిలీట్

* సోషల్ మీడియా దుర్వినియోగంపై కఠిన చర్యలు
* జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల హెచ్చరిక



నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 09(భారత శక్తి): భైంసా పట్టణంలో ఇటీవల కొంతమంది వ్యక్తులు తప్పుడు ఫేస్‌బుక్ అకౌంట్లను సృష్టించి, మార్ఫ్ చేసిన వీడియోలు, మత విద్వేషాలకు దారితీసే పోస్టులు ప్రచారం చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ పోస్టులు రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతలు రెచ్చగొట్టే విధంగా ఉండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా పరిగణించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి, వేగవంతమైన దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి జరిపిన దర్యాప్తులో భాగంగా రెండు తప్పుడు ఫేస్‌బుక్ అకౌంట్లను పోలీసులు గుర్తించి, వాటిని డిలీట్ చేయించారు. త్వరలోనే ఈ అకౌంట్లను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించి, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సోషల్ మీడియాలో అనుమానాస్పదంగా, మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు గమనించిన పక్షంలో ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తప్పుడు ప్రచారాలను నమ్మకుండా, జిల్లా శాంతి భద్రతలను కాపాడేందుకు అందరూ సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా
## ప్రభుత్వ ఆసుపత్రి నుండి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 09: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6 నుండి 11 వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా గురువారం ప్రభుత్వ ఆసుపత్రి నుండి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, ప్రజల్లో ఆరోగ్య సంరక్షణ పట్ల చైతన్యం కలిగించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు నిర్వహించిన స్పెషల్ క్యాంప్‌లో భాగంగా సంపూర్ణ సురక్ష కేంద్రం, ట్రాన్స్ జెండర్ క్లినిక్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా ప్రత్యేక వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఆరోగ్య వారోత్సవాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యమని, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, ప్రత్యేక వర్గాల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నదని తెలిపారు. పరిశుభ్రత, పోషకాహారం, నివారణాత్మక వైద్యంపై దృష్టి పెట్టడం ద్వారా అనేక వ్యాధులను ముందుగానే నివారించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖఅధికారి రవీందర్, ఆసుపత్రి సూపరింటెంట్ వెంకటేశ్వర్, డిసిహెచ్ఎస్ విజయ భాస్కర్ రెడ్డి, ఆర్డీఓ ఎన్ వి గిరి, తహసీల్దార్ హిమబిందు, డిపిఆర్ఓ తిరుమల, ఎంపీడీఓ రాణి, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, తదితరులు, పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల సాగు వైపు రైతులు అడుగులు వేయాలి

* క్షీరసాగర్లో కూరగాయల సాగుపై రైతులకు అవగాహన
* సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేస్తాం
* తక్కువ మోతాదులో రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించాలి
* విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.. దండ రాజిరెడ్డి





సిద్దిపేట, ఏప్రిల్ 09 (భారత శక్తి) : ఉద్యాన పంటల సాగు వైపు రైతులు అడుగులు వేయాలని పంటల సాగు విధానానికి తగిన ప్రోత్సాహకాలు అందిస్తాని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా..దండ రాజిరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలోని క్షీరసాగర్ గ్రామపంచాయతీలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గురువారం రైతు సదస్సు నిర్వహించారు. విశ్వవిద్యాలయం పరిధిలోని మొజెర్ల కళాశాల హార్టికల్చర్ తుది సంవత్సరం విద్యార్థులు గ్రామీణ ఉద్యాన పనుల అనుభవ కార్యక్రమం (RHWEP)లో భాగంగా ఈ కార్యక్రమాన్ని జరగగా పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్ సహకారంతో కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి హాజరై ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కొన్యాల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో సదస్సు కొనసాగించారు.ఈ సందర్భంగా విద్యార్థులు రైతుల సాగు పద్ధతులు, పంటల నమూనాలను అధ్యయనం చేసి తక్కువ మోతాదులో రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించాలని సూచించారు. కోల్డ్ స్టోరేజ్, అగ్రి వోల్టాయిక్ వ్యవస్థ, మల్చింగ్ విధానం, వివిధ కూరగాయల హైబ్రిడ్ రకాలపై ప్రదర్శనలు నిర్వహించారు. మొజెర్ల RHWEP విద్యార్థినులు పురుగుమందుల పిచికారీ సమయంలో పాటించాల్సిన భద్రతా నియమాలు, వ్యవసాయ రసాయనాల లేబుళ్లు, వాటి ఆరోగ్య ప్రభావాలపై రైతులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మోనో యాక్టింగ్, నృత్యాలతో రైతులను ఆకట్టుకుంటూ ఉద్యాన పంటల సాగు వైపు ప్రోత్సహించారు.ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి ప్రసంగించారు. క్షీరసాగర్ గ్రామాన్ని విశ్వవిద్యాలయం దత్తత తీసుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయడం, నేల పరీక్షలు నిర్వహించడం, వ్యవసాయ మరియు ఉద్యాన శాఖలతో కలిసి టెక్నాలజీ సెంటర్ స్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సర్పంచ్ కొన్యాల బాల్ రెడ్డి మాట్లాడుతూ క్షీరసాగర్ గ్రామాన్ని కూరగాయల సాగులో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని, ప్లాస్టిక్ రహిత గ్రామంగా మార్చాలని, రైతుల ప్రయోజనార్థం రైతు వేదికను ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డా. టి. సురేష్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. డి. లక్ష్మీనారాయణ, ఆఫీసర్ ఇంచార్జ్ డాక్టర్ వి. సుచిత్ర, ఎంపీడీవో మీరా స్వర్ణకుమారి, వైస్ సర్పంచ్ నల్ల నరేష్, మాజీ సర్పంచులు కాయితి యాదమ్మ, కాయితి నర్సింహరావు, మతాల వెంకటేష్ గౌడ్, ఉద్యాన యూనివర్సిటీ అధ్యాపకులు సతీష్, సింధుజ, రాజశేఖర్, గ్రామ రైతులు, విద్యార్థినులు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఉమేష్ గౌడ్ చిత్రపటానికి మధుయాష్కి నివాళి...

ఎల్బీనగర్ : ఏప్రిల్ 9 (భారత శక్తి) : సాహెబ్ నగర్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాదాసు ఉమేష్‌గౌడ్ దశదినకర్మ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమేష్ గౌడ్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**పాల్గొన్న ముఖ్యులు:**

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని రవీందర్ గౌడ్, చంపాపేట డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు పాల్గొన్నారు. అలాగే కర్మాన్‌ఘాట్ దేవాలయ డైరెక్టర్ కంచర్ల కవిత, నాయకులు బండిగారి అశోక్ గౌడ్, పర్వతి గణేష్ రెడ్డి, కొత్త శ్రీధర్ గౌడ్, కొప్పుల వెంకటరెడ్డి, సుమన్ గౌడ్, పోచబోయిన సురేష్ యాదవ్, మణిశ్రీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల జీవితాల్లో చీకట్లు నింపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

* గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి



సిద్దిపేట, భారత శక్తి (ఏప్రిల్ 09) : తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు విద్యుత్ ఆర్టిజన్ అన్ మాండ్ మరియు పీస్ రేటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గజ్వేల్ లోని విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న విద్యుత్ ఆర్టిజన్ కార్మికులకు మద్దతు తెలిపి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ అబద్ధాల పునాదుల మీద ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి అధికారంలోకి రాకముందు ఎన్నికల్లో తాను చేసిన పాదయాత్ర మరియు అనేక సభలలో విద్యుత్ కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపుతామని చెప్పి రేవంత్ రెడ్డి విద్యుత్ విద్యుత్ కార్మికుల జీవితాల్లో చీకట్లు నింపుతున్నారని, విద్యుత్ కార్మికులను మోసం చేశారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నిత్యం వెలుగులో ఉంచే విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా 20వేల మంది డివిజన్ కార్యాలయం ముందు ధర్నాలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ కార్మికులను కూడా మోసం చేస్తున్నారని, ఇచ్చిన హామీ మేరకు ఆర్టిజన్ కార్మికులను వెంటనే విద్య అర్హతను బట్టి కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ కార్మికులుగా విలీనం కానీ కార్మికులను ఆర్టిజన్లుగా విలీనం చేసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేశారు. టీజీ ఎస్పీడీసీఎల్, టీఎస్ఎస్పీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న అన్మాండ్ కార్మికులందరినీ ఆర్టిజెన్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వాలు రెగ్యులరైజ్ ఎలా చేశాయో ప్రస్తుతం ఉన్న వారిని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ ప్రభుత్వంలో విద్యుత్ కార్మికులు సంతోషంగా ఉంటే నేడు రేవంత్ రెడ్డి పాలనలో విద్యుత్ కార్మికులు ఆందోళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి విద్యుత్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని లేనిపక్షంలో విద్యుత్ కార్మికులతో రోడ్లను దిబ్బందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందనా రవీందర్, కౌన్సిలర్లు బొగ్గుల స్వప్న సురేష్, మామిడి శ్రీధర్, విద్యుత్ జేఏసీ ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ షాదుల్ పాషా, వైస్ చైర్మన్ రామగౌనీ రవికుమార్. గజ్వేల్ డివిజన్ సిరినేని భూపతి రాజు, గజ్వేల్ డివిజన్ కన్వీనర్ శ్రీధర్, డివిజన్ వైస్ చైర్మన్ యాదగిరి గౌడ్, ఖలీల్ భాషా, చంద్రం యాదవ్, కోశాధికారి కుంట కిషన్, జాయింట్ సెక్రటరీ శ్రావణ్ రెడ్డి, జహంగీర్, బుచ్చిరెడ్డి, బాలకిషన్, కరుణాకర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## మల్లికార్జున ఖర్గేపై బీజేపీ మాజీ కార్పొరేటర్ ఫిర్యాదు

ఎల్బీనగర్, ఏప్రిల్ 09 (భారత శక్తి): సరూర్నగర్ పోలీస్ స్టేషన్ లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన ద్వేషపూరిత వ్యాఖ్యలపై సరూర్ నగర్ మాజీ బీజేపీ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఫిర్యాదు చేశారు.ఒక సమావేశంలో మల్లికార్జున్ ఖర్గే బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై "చంపాలి" వంటి వ్యాఖ్యలు చేయడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం, ప్రజాస్వామ్యానికి ముప్పు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌పై బిల్లు తీసుకువస్తామని చెప్పి, తమ సొంత పార్టీ నాయకుల విషయంలో మౌనం పాటించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం.ఆ మౌనం కూడా తప్పుతో సమానమేనని ఆమె అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## దోమల నియంత్రణకు స్వంత ఖర్చులతో ఫాగింగ్ యంత్రాలు

* బీఆర్ఎస్ యువనేత చంద్రశేఖర్ రెడ్డి సేవా కార్యక్రమం




ఎల్బీనగర్, ఏప్రిల్ 09 (భారత శక్తి):ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న యువనేత సొంటి చంద్రశేఖర్ రెడ్డి మరోసారి సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచనల మేరకు "దోమలపై యుద్ధం" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సొంటి చంద్రశేఖర్ రెడ్డి స్వంత నిధులతో రెండు దోమలను పారదోలే ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. ఈ యంత్రాలను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, దోమల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజా ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని కోరారు. అనంతరం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, చైతన్యపురి డివిజన్‌లో ఫాగింగ్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పిలుపు మేరకు స్వంత నిధులతో ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేసి, బుధవారం నుండి ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో నిరవధికంగా ఫాగింగ్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం కూడా మరిన్ని ఫాగింగ్ యంత్రాలు అందుబాటులోకి తీసుకు వచ్చి దోమల బెడద నుంచి ప్రజలను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తోట మహేష్ యాదవ్, శివ ప్రకాష్, లక్ష్మీనారాయణ గౌడ్, విశ్వప్రేమ్ కుమార్ అదాలత్, శ్రీహరి, తులసి కృష్ణ గౌడ్, జలంధర్, పులి కిరణ్, సాయి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం ఎల్బీనగర్ సర్కిల్ 13 ఏఎంఓహెచ్ డాక్టర్ డి.ఆర్. దీప్తి ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి సరూర్ నగర్ సర్కిల్ 12 అంబేడ్కర్ కాలనీలో, ఎల్ బీ నగర్ సర్కిల్ 13 జనార్దన్ నగర్ లో ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమీషనర్ బోనగిరి శ్రీనివాస్, డిఈఈ చందన సందర్శించారు.**

**ఎల్బీనగర్, ఏప్రిల్ 09 (భారత శక్తి):**

## జనగణన ప్రక్రియను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలి



జగిత్యాల ఏప్రిల్ 9(భారత శక్తి ప్రతినిధి ): వెల్గటూర్ తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న జనగణన పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో కొనసాగుతున్న జనగణన ప్రక్రియపై అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జనగణన పనుల పురోగతిని సమీక్షించిన, ప్రతి వివరాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎటువంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా పనులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం సమాచార సేకరణ జరగాలని అన్నారు. అలాగే జనగణన ప్రక్రియను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో సేకరించే సమాచారం సమగ్రంగా ఉండేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, సంబంధిత శాఖల అధికారులు మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పవన్ ఖేరా అరెస్ట్‌పై ఉత్కంఠ... తీర్పు రిజర్వ్ చేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 09 (భారత శక్తి): కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరాకు అరెస్ట్ నుంచి తాత్కాలిక ఊరట లభిస్తుందా లేదా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ భార్య రినికి భూయాన్ శర్మపై పరువు నష్టం కలిగించే ఆరోపణలు చేశారన్న కేసులో, తనను అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కల్పించాలని కోరుతూ పవన్ ఖేరా దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు గురువారం తన తీర్పును రిజర్వ్ చేసింది. జస్టిస్ కె. సుజన శుక్రవారం ఈ తీర్పును వెలువరించే అవకాశం ఉంది. అసోం పోలీసులు నమోదు చేసిన కేసు నేపథ్యంలో, అక్కడి కోర్టులను ఆశ్రయించేందుకు వీలుగా తనకు ట్రాన్సిట్ యాంటిసిపేటరీ బెయిల్ మంజూరు చేయాలని ఖేరా తన పిటిషన్‌లో కోరారు. ఖేరా తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, అసోం పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆరోపించారు. అయితే, అసోం అడ్వకేట్ జనరల్ దేవాజిత్ సైకియా ఈ వాదనలను వ్యతిరేకించారు. ఢిల్లీ నివాసి అయిన ఖేరా, హైదరాబాద్‌లో ముందస్తు బెయిల్ పిటిషన్ ఎందుకు దాఖలు చేశారో సరైన కారణాలు చూపలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రినికి భూయాన్ శర్మకు పలు విదేశీ పాస్‌పోర్టులు, విదేశాల్లో ప్రకటించని ఆస్తులు ఉన్నాయని పవన్ ఖేరా ఇటీవల ఓ ప్రెస్‌మీట్‌లో సంచలన ఆరోపణలు చేశారు. దీనిపై అసోం పోలీసులు ఆయనపై పరువునష్టం, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర వంటి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 14 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఢిల్లీలోని ఖేరా నివాసానికి వెళ్లగా ఆయన అందుబాటులో లేరు. మరోవైపు, హైదరాబాద్‌లోని ఆయన భార్య నీలిమ ఇంటి వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో, అజ్ఞాతం నుంచి పవన్ ఖేరా ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. ఆయనపై, ఆయన భార్యపై వచ్చిన ఆరోపణలకు సీఎం సమాధానం చెప్పాలే తప్ప, పోలీసులను అడ్డుపెట్టుకోవడం సరికాదని అన్నారు. ఇలాంటి బెదిరింపులకు భయపడనని, రాహుల్ గాంధీ సైనికుడిగా ప్రశ్నలు అడుగుతూనే ఉంటానని స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నా

జగిత్యాల, ఏప్రిల్ 09 (భారత శక్తి): తాను బీఆర్ఎస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నానని జగిత్యాల మాజీ ఎమ్మెల్యే, ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన జీవన్ రెడ్డి ప్రకటించారు. శేషజీవితంలో కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేస్తే రాష్ట్ర భవిష్యత్తు కోసం కూడా పాటుపడవచ్చని పేర్కొన్నారు. అంతకుముందు, జగిత్యాలలో జీవన్ రెడ్డిని బీర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. హైదరాబాద్ నుంచి జగిత్యాలకు చేరుకున్న కేటీఆర్... జీవన్ రెడ్డితో ఆయన నివాసంలో గంటకు పైగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేటీఆర్ వెంట ఎల్. రమణ, పాడి కౌశిక్ రెడ్డి, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

## హైదరాబాద్ శివార్లలో అగ్నికీలలు.. రెండు చోట్ల భారీ ప్రమాదాలు

హైదరాబాద్, ఏప్రిల్ 09 (భారత శక్తి): హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో వరుసగా చోటుచేసుకుంటున్న అగ్నిప్రమాదాలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. జీడిమెట్ల, దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు భారీ అగ్ని ప్రమాదాలతో స్థానికులు భయంతో పరుగులు తీశారు. వివరాల్లోకి వెళ్తే.. జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని రాంరెడ్డి నగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన సాల్వెంట్ డ్రమ్ముల గోదాంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించాయి. మంటల తీవ్రతకు కెమికల్ డ్రమ్ములు భారీ శబ్దాలతో పేలుతూ రోడ్లపైకి ఎగసిపడ్డాయి. దీంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకోవడంతో, స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఇదిలా ఉండగా, దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ కాలనీలో ఉన్న ఓ డెకరేషన్ సామగ్రి గోదాంలో మరో అగ్నిప్రమాదం జరిగింది. ప్లాస్టిక్ వస్తువులు ఎక్కువగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి పక్కనే ఉన్న ఇంటికి కూడా అంటుకున్నాయి. కాలనీ మొత్తం దట్టమైన పొగ కమ్మేయడంతో ప్రజలు శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు సంఘటనా స్థలాలకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సౌదీ కీలక ఆయిల్ పైప్‌లైన్‌పై డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ దాడి

వాషింగ్టన్/రియాద్, ఏప్రిల్ 9 : అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే ఇరాన్ మళ్లీ తన దూకుడు ప్రదర్శించింది. సౌదీ అరేబియాలోని అత్యంత కీలకమైన ముడి చమురు పైప్‌లైన్‌ను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు, క్షిపణులతో దాడికి పాల్పడింది. ఈ ఘటనతో ప్రపంచ ఇంధన మార్కెట్‌లో ఒక్కసారిగా కలకలం రేగింది. పర్షియన్ గల్ఫ్ నుంచి ఎర్ర సముద్రంలోని యన్‌బు ఓడరేవుకు చమురును రవాణా చేసే ఈ 'ఈస్ట్‌వెస్ట్' పైప్‌లైన్ సౌదీకి అత్యంత వ్యూహాత్మకమైనది. సుమారు 1,200 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గం, వివాదాస్పద హార్ముజ్ జలసంధిని దాటకుండా చమురు ఎగుమతి చేసేందుకు సౌదీకి ఉన్న ఏకైక ప్రత్యామ్నాయం. యన్‌బు ప్రాంతంలోని పంపింగ్ స్టేషన్లను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిపినట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్ జీసీ) ప్రకటించింది. ఈ ఘటనలో ఒక పంపింగ్ స్టేషన్ వద్ద మంటలు చెలరేగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటించి, చమురు సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన వెంటనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. రోజుకు 70 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా సామర్థ్యం ఉన్న ఈ పైప్‌లైన్ దెబ్బతినడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు మరోసారి ఆకాశాన్నంటే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సౌదీ ప్రభుత్వ చమురు సంస్థ అరామ్‌కో నష్టాన్ని అంచనా వేస్తోంది. అయితే, నష్టం పరిమితంగానే ఉందని, పైప్‌లైన్ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోలేదని ప్రాథమికంగా తెలుస్తోంది. ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని అమెరికా జనరల్ డాన్ కెయిన్ హెచ్చరించారు. ఈ ఘటనను అమెరికా రక్షణ శాఖ నిశితంగా గమనిస్తోంది.

## భూ రికార్డులకు బ్రేక్.. చంద్రబాబు కీలక ప్రకటన!

గుంటూరు, ఏప్రిల్ 09 (భారత శక్తి): రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత ముగింపు పలికే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని, 2027 మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా 1.12 కోట్ల పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేయడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని సూరేపల్లిలో గురువారం జరిగిన 'మీ భూమిమీ హక్కు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు కొత్త పాస్‌పుస్తకాలను అందజేసి, వారి సమక్షంలోనే భూ వివరాలను అధికారులతో చదివి వినిపించారు. అవినీతికి ఆస్కారం లేకుండా, ఆటో మ్యుటేషన్ తర్వాత పాస్‌బుక్‌ను నేరుగా యజమాని ఇంటికే పంపాలని అధికారులను ఆదేశించారు.

### భూ రికార్డులకు పటిష్ఠ భద్రత

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. భూమి కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది ప్రజల భద్రత, జీవనాధారమని అన్నారు. భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు 'రీ సర్వే 2.0' చేపట్టామని, 2027 మార్చి నాటికి రాష్ట్రంలోని 16,816 గ్రామాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. కొత్త పాస్‌పుస్తకాలకు కరెన్సీకి వాడే టెక్నాలజీనే వినియోగిస్తున్నామని, దీనివల్ల భవిష్యత్తులో ఎవరూ రికార్డులను తారుమారు చేయలేరని భరోసా ఇచ్చారు. "రికార్డులు ట్యాంపరింగ్ కాకుండా బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ విధానం తీసుకొచ్చాం. భూ యజమానులు తమ ఆధార్, ఈకేవైసీ ద్వారా భూ రికార్డులను లాక్ చేసుకునేందుకు 'రికార్డుల లాకర్ సిస్టమ్'ను అందుబాటులోకి తెచ్చాం. ఇది ప్రజల ఆస్తులకు రక్షణ కవచంగా ఉంటుంది. ప్రజల భూములకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతోనే వివాదాస్పద ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

### * 22ఏ జాబితా ప్రక్షాళన, కీలక నిర్ణయాలు

భూ యజమానులకు మేలు చేసే పలు కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించారు. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నట్లు వెల్లడించారు. 2016కు ముందు ప్రభుత్వ హౌసింగ్ స్కీమ్‌లో పట్టా పొందిన సుమారు 75 లక్షల పేద కుటుంబాలకు రిజిస్ట్రేషన్ సౌలభ్యం కల్పిస్తున్నామని, దీనివల్ల వారు తమ ఆస్తులను అమ్ముకునేందుకు, గిఫ్ట్‌గా ఇచ్చేందుకు వీలవుతుందని తెలిపారు. గత ప్రభుత్వం 14 లక్షల ఎకరాల పట్టా భూములను అక్రమంగా 22ఏలో చేర్చిందని, ఆ జాబితాను పూర్తిగా సంస్కరిస్తున్నామని అన్నారు. సమస్యల సత్వర పరిష్కారానికి 22ఏపై కలెక్టర్ అధికారాలను జేసీ, ఆర్డీవోలకు బదలాయిస్తున్నట్లు ప్రకటించారు. వెబ్‌ల్యాండ్ తప్పులను సుమోటోగా సరిదిద్దే అధికారాన్ని ఆర్డీవోలు, తహసీల్దార్లకు ఇస్తామని చెప్పారు.

### * ఆటో-మ్యూటేషన్‌తో ఇంటికే పాస్‌బుక్

ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సంస్కరణలు తెస్తున్నామని సీఎం తెలిపారు. "జూన్ 2024 నుంచి ఇప్పటివరకు 9 లక్షల భూ లావాదేవీలకు ఆటోమ్యూటేషన్ పూర్తి చేశాం. అమ్మకాలు, బహుమతులు, విభజన పత్రాల్లో 100 శాతం ఆటోమ్యూటేషన్ తీసుకొచ్చాం. ఇకపై పాస్‌బుక్ కోసం ప్రజలు అధికారుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. ఆస్తి రిజిస్ట్రేషన్ కాగానే, ప్రింట్ చేసిన పాస్‌బుక్‌ను నేరుగా యజమాని ఇంటికి పంపాలి" అని అధికారులను ఆదేశించారు. వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా సులభతరం చేశామని, స్లాట్ బుకింగ్ విధానంతో గంటల తరబడి నిరీక్షించే అవసరం లేకుండా చేశామని పేర్కొన్నారు.

### * కన్నతల్లిని కోర్టుకీడ్చిన వ్యక్తి ప్రజలకు ఆదర్శం కాదు

గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "గత ప్రభుత్వంలో ప్రజల భూములపై కన్నేసి కబ్జాలు చేశారు. రికార్డులు తారుమారు చేసి ప్రతీ గ్రామంలో భూ వివాదాలు సృష్టించారు. అధికారం ఉందని పట్టాదారు పాస్‌పుస్తకాలపై, సరిహద్దు రాళ్లపై కూడా తమ బొమ్మలు వేసుకుని వందల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. వారు అధికారం నుంచి దిగిపోయినా వారి పాపాలు, అక్రమాలు ఇంకా వెంటాడుతున్నాయి. అంతలా రెవెన్యూ వ్యవస్థను నాశనం చేశారు. కన్నతల్లిని కోర్టుకీడ్చిన వ్యక్తి ప్రజలకు ఆదర్శం కాదు" అని పరోక్షంగా జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, కక్షలకు దూరంగా గౌరవంగా బతకాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇల్లు, భూమి, కారు ఏదీ లేదు: మమతా బెనర్జీ

కోల్‌కతా, ఏప్రిల్ 09 (భారత శక్తి): పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తనకు సొంత ఇల్లు, భూమి లేదని తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. భవానీపూర్ నుంచి పోటీ చేస్తున్న ఆమె నిన్న నామినేషన్ దాఖలు చేశారు. ఇందులో ఆమె తన ఆస్తుల వివరాలను వెల్లడించారు. తనకు సొంత ఇల్లు, వ్యవసాయ భూమి, ఖాళీ స్థలం, నివాస సంబంధిత ఆస్తులు ఏమీ లేవని పేర్కొన్నారు. తనకు కనీసం వ్యక్తిగత వాహనం కూడా లేదని తెలిపారు. కాళీఘాట్‌లోని 30బీ హరీశ్ ఛటర్జీ వీధిలోని నివాసాన్ని తన చిరునామాగా పేర్కొన్నారు. ఈ ఇల్లు తన పేరు మీద రిజిస్టర్ కాలేదని తెలిపారు. తన పేరుపై రెండు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని, చేతిలో రూ.75,700 నగదు ఉన్నట్లు పేర్కొన్నారు. రెండు ఖాతాల్లో ఒకటి వ్యక్తిగత బ్యాంకు ఖాతా కాగా, రెండోది ఎన్నికల ఖర్చు కోసం తీసుకున్న బ్యాంకు ఖాతాగా పేర్కొన్నారు. వ్యక్తిగత ఖాతాలో రూ.12,36,209 ఉండగా, రెండో ఖాతాలో రూ.40 వేలు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. తన చరాస్థుల విలువను ఆమె రూ.15.37 లక్షలుగా వెల్లడించారు. ఇందులో బ్యాంకు డిపాజిట్లు, నగదు, బంగారు ఆభరణాలు ఉన్నాయి. తన వద్ద 9.75 గ్రాముల బంగారం ఉందని, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఇది రూ.1.75 లక్షలుగా పేర్కొన్నారు. 202526 సంవత్సరంలో తనకు రూ.40,600 టీడీఎస్ రిఫండ్ వచ్చినట్లు చెప్పారు. రాయల్టీలు, బ్యాంకు వడ్డీలు తన ప్రాథమిక ఆదాయంగా వెల్లడించారు.

## హార్ముజ్ జలసంధి నుంచి వెనక్కి మరలుతున్న నౌకలు

టెహ్రాన్/దుబాయ్, ఏప్రిల్ 9 : ఇరాన్, అమెరికా దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో మొదట ఇరాన్ హార్ముజ్ జలసంధిని తెరిచింది. కానీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి నేపథ్యంలో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారియి. హార్ముజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దీనితో జలసంధిని దాటేందుకు వచ్చిన నౌకలు తిరుగుముఖం పట్టాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అమెరికా, ఇరాన్ దేశాలు కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత పలు నౌకలు హార్ముజ్ జలసంధిని దాటాయి. గ్రీక్‌కు చెందిన బల్క్ క్యారియర్ 'ఎన్‌జే ఎర్త్', లైబీరియా జెండా కలిగిన 'డేటోనా బీచ్' అనే రెండు నౌకలు ఈ జలసంధిని దాటాయి. అదే సమయంలో 'ఏయూఆర్ఓయూఆర్ఏ' నౌక ఈ జలసంధిని దాటేందుకు సిద్ధమైన సమయంలో ఉద్రిక్తతలు తిరిగి చోటు చేసుకున్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడంతో 250 మందికి పైగా మృతి చెందారు. దీనితో ఇరాన్ హార్ముజ్‌ను మూసివేసింది. దీనితో ముసందమ్ తీరం సమీపంలో ఈ నౌక వెనక్కి మళ్లింది. హార్ముజ్‌ను దాటేందుకు సిద్ధమైన మరిన్ని నౌకలు కూడా వెనుదిరిగినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి.

## బెంగాల్‌లో బీజేపీ అద్భుత విజయం సాధిస్తుంది

హల్దియా, ఏప్రిల్ 09: బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, బీజేపీ అద్భుత విజయం సాధిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. హల్దియాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఐదేళ్ల క్రితం నందిగ్రామ్‌లో మమతా బెనర్జీ ఓడిపోయారని గుర్తుచేశారు. ఈసారి రాష్ట్రమంతా అదే ఫలితం వస్తుందని అన్నారు. ఇప్పుడు భవానీపూర్‌లో (మమతా బెనర్జీ పోటీ చేస్తున్నారు) కూడా అదే ఫలితం వస్తుందని అన్నారు. ఈ ఎన్నికలు బెంగాల్ అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఉపయోగపడే ఎన్నికలు అన్నారు. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధి విషయంలో అడ్డుపడుతోందని విమర్శించారు. ప్రైవేటు రంగాల్లో సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటుదారులకు అవకాశం కల్పిస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే టీఎంసీ మోసాలు ప్రజల ముందు ఉంచుతామని మోదీ పేర్కొన్నారు. బెంగాల్ యువతను తృణమూల్ కాంగ్రెస్ ఎంతో మోసం చేసిందని, ఆ పాపాలు ఊరికే



పోవని హెచ్చరించారు. బెంగాల్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ రాగానే కేంద్ర పథకాలు ఇక్కడ అమల్లోకి వస్తాయని హామీ ఇచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ హయాంలో జరిగిన అన్యాయాలు, కుంభకోణాలపై విచారణ జరిపి, కారకులైన వారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. శరణార్థులకు ఆశ్రయమిస్తామని, కానీ చొరబాటుదారులను తరిమికొడతామని స్పష్టం చేశారు.

## తీవ్ర ఉద్రిక్తతల నడుమ హార్ముజ్ దాటి భారత్ చేరుకున్న 'గ్రీన్ ఆశా'

ముంబై, ఏప్రిల్ 09 (భారత శక్తి): పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నడుమ, భారత ఇంధన సరఫరా వ్యవస్థలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. 'గ్రీన్ ఆశా' అనే భారతీయ జెండా కలిగిన ఎల్‌పీజీ నౌక, 15,400 టన్నుల లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ)తో గురువారం నవీ ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ (జేఎన్‌పీఏ)కు సురక్షితంగా చేరుకుంది. భౌగోళికంగా అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని విజయవంతంగా దాటిన ఈ నౌక, జేఎన్‌పీఏలోని భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), ఇండియన్ ఆయిల్ (ఐఓసీఎల్) నిర్వహిస్తున్న లిక్విడ్ బెర్త్‌లో లంగరు వేసింది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం ప్రారంభమైన తర్వాత జేఎన్‌పీఏకు చేరుకున్న మొట్టమొదటి ఎల్‌పీజీ నౌక ఇదే కావడంతో దీనిని ఒక ముఖ్యమైన మైలురాయిగా అధికారులు అభివర్ణించారు. నౌకలోని సిబ్బంది, కార్గో అంతా సురక్షితంగా ఉన్నట్లు జేఎన్‌పీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల ఉద్రిక్తతలు మొదలైనప్పటి నుంచి హార్ముజ్ జలసంధిని దాటిన ఎనిమిదో భారత నౌక 'గ్రీన్ ఆశా'. క్లిష్టమైన భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లోనూ దేశానికి అవసరమైన నిత్యావసర సరుకుల సరఫరాను నిరంతరాయంగా కొనసాగించే భారత సముద్ర రవాణా సామర్థ్యానికి ఈ సంఘటన నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నౌక రాకతో దేశీయ ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థకు మరింత భరోసా లభించినట్లయింది.

## జీవన్ రెడ్డిపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అసహనం

హైదరాబాద్కాం, ఏప్రిల్ 09 (భారత శక్తి):గ్రెస్ పార్టీకి కొన్నిరోజుల క్రితం రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డిపై ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. ముఖ్యమంత్రిపై విమర్శలు జీవన్ రెడ్డికి సరికాదని అన్నారు. ఎమ్మెల్యేలందరూ కలిసి ఆయనను ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ఇప్పుడు చేపడుతున్న పద్ధతికి తాము వ్యతిరేకమని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జనాభా ఆధారంగా పునర్విభజన చేస్తే దక్షిణ భారతదేశం నష్టపోతుందని అన్నారు. దక్షిణ భారతదేశానికి అన్యాయం జరగకూడదనే తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఈ రెండు పార్టీలు కలిసిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై చేస్తున్న విమర్శలకు ఆధారాలు ఉంటే హరీశ్ రావు చూపించాలని డిమాండ్ చేశారు. తాము చర్చకు సిద్ధమని సవాల్ చేశారు.

# మామిడిపల్లిలో 'హైడ్రా' క్షేత్రస్థాయి పరిశీలన



* **చెరువులు, నాలాల కబ్జాపై రంగనాథ్ దృష్టి.. అక్రమ నిర్మాణాలపై విచారణకు ఆదేశం**

మామిడిపల్లి, ఏప్రిల్ 9 (భారత శక్తి) : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మామిడిపల్లి గ్రామ పరిధిలోని చెరువులు, నాలాల ఆక్రమణలపై హైడ్రా (HYDRAA) కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. స్థానిక రైతులు, గ్రామస్థుల ఫిర్యాదు మేరకు గురువారం ఆయన అధికారులతో కలిసి వివాదాస్పద ప్రాంతాలను పరిశీలించారు.

* **కబ్జా కోరల్లో కుంటలు.. నీటి మళ్లింపుపై ఆగ్రహం**

గ్రామంలోని ఉంగరోని కుంట అలుగు ఎత్తును నిబంధనలకు విరుద్ధంగా పెంచి, నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నారని బాధితులు కమిషనర్‌కు వివరించారు. ఎస్ఆర్ఆర్ ఏరోసిటీ కోవ్, పయనీర్ బిల్డర్స్ వంటి సంస్థలు రియల్ ఎస్టేట్ వెంచర్ల కోసం నాలాలను ఆక్రమించి విల్లాల నిర్మాణం చేపడుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలుగు ఎత్తు పెంచడం వల్ల వర్షాకాలంలో నీరు వెనక్కి తన్ని చుట్టుపక్కల పంట పొలాలు మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**అక్రమ మట్టి నింపడంపై ఆందోళన:**


చెరువు కట్ట కింద ఎస్ఆర్ఆర్ (SRR), జీఎంఆర్ (GMR) సంస్థలు ఎటువంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున మట్టిని నింపుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. దీనివల్ల కట్ట బలహీనపడి భవిష్యత్తులో గ్రామానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఐఆర్ఏ శ్రీనిధి (IRA Sreenidhi), ఫినిక్స్ (Phoenix) సంస్థలు కూడా ఉంగరోని కుంట, కంకాయకుంట నాలాలను ఆక్రమించి నిర్మాణాలను కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు.

**అధికారుల తీరుపై ఫిర్యాదు:**

గతంలో ఈ అక్రమాలపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని బాధితులు ఆరోపించారు.

* తప్పుడు సమాచారం ఇచ్చారనే ఆరోపణలతో ఇరిగేషన్ డీఈ (DE) జగదీష్, ఏఈఈ (AEE) గంగరాజుపై చర్యలు తీసుకోవాలని కోరారు.
* విధుల్లో నిర్లక్ష్యం వహించిన బాలాపూర్ తహసీల్దార్ (MRO) ఇందిరాదేవిపై కూడా బాధ్యత ఖరారు చేయాలని విన్నవించారు.

త్వరితగతిన చర్యలు తీసుకుంటాం: రంగనాథ్ ఫిర్యాదులను స్వీకరించిన కమిషనర్ రంగనాథ్.. క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. నిబంధనల అతిక్రమణ జరిగినట్లు తేలితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై తక్షణమే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా ఏసీపీ త్రిలేశ్వర రావు, ఎస్ఐ ముజఫర్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## మధు ఎస్కి చేతుల మీదుగా
## 350 మంది కార్మికులకు 'బీఓసీ' కార్డుల పంపిణీ

హయత్ నగర్: ఏప్రిల్ 9 (భారతశక్తి) : ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని రాజీవ్ గాంధీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్టీయూసీ) ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు (బీఓసీ) గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. హయత్ నగర్ లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్ చార్జి, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాస్కీ గౌడ్ చేతుల మీదుగా గురువారం 50 మంది కార్మికులకు ఈ కార్డులను అందజేశారు. దీంతో ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఐఎన్టీయూసీ ద్వారా మొత్తం 350 మంది కార్మికులకు ఈ కార్డులు లభించినట్లయింది. ఈ సందర్భంగా మధుయాస్కీ గౌడ్ మాట్లాడుతూ.. గతంలో సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ హయాంలో తీసుకువచ్చిన అసంఘటిత కార్మిక సామాజిక భద్రత చట్టం వల్ల నేడు రాష్ట్రంలో 17 లక్షల మంది కార్మికులకు భరోసా లభిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందనడానికి ప్రమాద బీమా ఎక్స్‌గ్రేషియాను రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడమే నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం కార్మిక కుటుంబాల్లో ధైర్యాన్ని నింపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బి.రామకృష్ణారెడ్డి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ గౌడ్, యూనియన్ ప్రతినిధులు డి.వెంకటేష్, కిన్నెర లాలు, ఇరుగు యాదయ్య, ఆకారపు రాము, ప్రభాకర్, లక్ష్మయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల స్థలం కబ్జాకు యత్నం : ఎంపీ రఘునందన్‌రావు

* **రాత్రికి రాత్రి భవనం కూల్చివేతపై ఆగ్రహం**
* **కలెక్టర్ తీరుపై అసంతృప్తి.. సమగ్ర విచారణకు డిమాండ్**

పటాన్‌చెరు, ఏప్రిల్ 9 (భారత శక్తి) : పటాన్‌చెరు పట్టణం నడిబొడ్డున ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలాన్ని కబ్జా చేసేందుకు కుట్ర జరుగుతోందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. ఈ కుట్రలో భాగంగానే పాఠశాల భవనాన్ని రాత్రికి రాత్రి కూల్చివేశారని ఆయన మండిపడ్డారు. గురువారం పటాన్‌చెరు శ్రీనగర్ కాలనీలో కూల్చివేతకు గురైన పాఠశాల భవనాన్ని బీజేపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.

**అధికారుల ఉదాసీనతపై ధ్వజం**

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తాను స్వయంగా కలెక్టర్, డీసీపీలకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసే వరకు కూల్చివేతలు ఆపకపోవడంపై తీవ్ర



అసంతృప్తి వ్యక్తం చేశారు. జాతీయ రహదారి విస్తరణకు ఈ పాఠశాల భవనం ఎలాంటి అడ్డంకిగా లేకపోయినా, ఏ అధికారంతో కూల్చివేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాఠశాల ప్రహరీ ముందున్న దుకాణాలను వదిలేసి, లోపల ఉన్న భవనాన్ని కూల్చడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

* **కోర్టు తీర్పులు ఉన్నా..**

**బరితెగింపు**

పాఠశాల స్థలంపై ఉన్న చారిత్రక ఆధారాలను రఘునందన్‌రావు ఈ సందర్భంగా ప్రదర్శించారు.

* 1962 కంటే ముందు నుంచే ఇక్కడ పాఠశాల ఉన్నట్లు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ప్రొసీడింగ్స్, సర్వే రిపోర్టులను చూపారు.
* ఈ భూమిపై గతంలో కొందరు వ్యక్తులు వివాదం సృష్టించినా.. దిగువ కోర్టు నుండి సుప్రీం కోర్టు వరకు అన్నిచోట్లా పాఠశాలకే అనుకూలంగా తీర్పులు వచ్చాయని గుర్తు చేశారు.
* కోర్టుల్లో ఓడిపోయిన వారు ఇప్పుడు అధికారుల అండతో కబ్జాకు యత్నిస్తున్నారని విమర్శించారు.

**ఆందోళన చేస్తామని హెచ్చరిక**

పాఠశాల స్థలాన్ని రక్షించాల్సిన జిల్లా యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడం శోచనీయమని ఎంపీ వ్యాఖ్యానించారు. కలెక్టర్ తక్షణమే స్పందించి విచారణకు ఆదేశించాలని, లేనిపక్షంలో స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ ప్రతాపరెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింగరావు, బీజేపీ మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్, నాయకులు శ్రీనివాస్ గుప్తా, బైండ్ల కుమార్, శంషాబాద్ రాజు ముదిరాజ్, కొండా లక్ష్మణ్, సుజాత, బాలాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితురాలి వివరాలు వెల్లడిస్తే కఠిన చర్యలు

* **బేగంపేట ఘటనపై మల్కాజిగిరి డీసీపీ హెచ్చరిక**

హైదరాబాద్, ఏప్రిల్ 9 (భారత శక్తి): బేగంపేటలో ట్రైనీ పైలట్‌పై జరిగిన లైంగిక దాడి కేసులో బాధితురాలి గుర్తింపును బయటపెట్టేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి డీసీపీ సి.హెచ్. శ్రీధర్ హెచ్చరించారు. ఈ కేసు దర్యాప్తులో ఉందని, బాధితురాలికి సంబంధించి తప్పుదోవ పట్టించే సమాచారాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై ఆయన సీరియస్ అయ్యారు.

**వివరాలు వెల్లడించడం నేరం**

బాధితురాలి పేరు, ఆమె కుటుంబ సభ్యుల వివరాలు, నివాస స్థలం లేదా ఆమె పనిచేసే/చదువుకునే సంస్థల పేర్లను ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ వెల్లడించడం శిక్షార్హమైన నేరమని డీసీపీ స్పష్టం చేశారు.

* **BNS సెక్షన్ 72:* భారతీయ న్యాయ సంహిత (గతంలో IPC 228A) ప్రకారం బాధితురాలి గుర్తింపు వెల్లడించడం చట్ట విరుద్ధం.**
* *సుప్రీంకోర్టు తీర్పు:* నిపుణ్ సక్సేనా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం.. బాధితురాలి వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచడం తప్పనిసరి.

**సోషల్ మీడియాకు వార్నింగ్**

యూట్యూబ్ ఛానెళ్లు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు బాధితురాలి ప్రైవసీకి భంగం కలిగించేలా వార్తలు రాయవద్దని పోలీసులు సూచించారు.

* ఇప్పటికే అప్‌లోడ్ చేసిన అభ్యంతరకర పోస్టులు, వీడియోలను వెంటనే తొలగించాలి.
* ధృవీకరించని సమాచారం, ఊహాగానాలను షేర్ చేస్తే దర్యాప్తుకు ఆటంకం కలిగించినట్లుగా పరిగణిస్తాం.

MALKAJGIRI POLICE COMMISSIONERATE
మల్కాజ్‌గిరి పోలీస్ కమీషనరేట్

* బాధితురాలి గుర్తింపు బయటపడేలా ఉన్న పరోక్ష సమాచారాన్ని కూడా నివారించాలి.

బాధ్యతాయుతమైన రిపోర్టింగ్ చేయాలని, చట్ట నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని డీసీపీ ఒక ప్రకటనలో తెలిపారు.

## నూతన కాలనీలకు
# మంచి నీరు అందించండి

* **జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే జీఎంఆర్**



పటాన్‌చెరు ఏప్రిల్ 9 (భారత శక్తి) : పటాన్‌చెరు నియోజకవర్గంలోని జలమండలి పరిధిలోగల నూతన కాలనీలకు సైతం రక్షిత మంచినీరు అందించేందుకు నిధులు కేటాయించాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్ లోని జలమండలి కార్యాలయంలో ఎండి అశోక్ రెడ్డి ని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామం, రాజరాజేశ్వరి కాలనీ ఫేజ్ 2, సృజన లక్ష్మీ కాలనీ ఫేజ్ 4, టైలర్స్ కాలనీ, లింగమయ్య కాలనీ, కె ఎస్ ఆర్ కాలనీలలో మంచినీటి సరఫరా లేకపోవడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత వేసవి కాలంలో ప్రతి రోజు ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు. పైన పేర్కొన్న కాలనీలలో నూతన పైపులైన్ల ఏర్పాటు కోసం ఇప్పటికే ప్రతిపాదనలు తయారు చేయడం జరిగిందని.. రెండు కోట్ల నిధులు మంజూరు చేస్తే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్ రెడ్డి.. అతి త్వరలో నిధుల మంజూరుకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే జీఎంఆర్ పేర్కొన్నారు.



# ఉపాధి హామీ కూలీలకు కాంగ్రెస్ పార్టీ అండ

* **డిసిసి అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి**

సిద్దిపేట, ఏప్రిల్ 09 (భారతశక్తి): ఉపాధి హామీ కూలీలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం కొక్కొండ గ్రామంలో ఉపాధిహామీ పనులను గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆశెల్లి విజేత వాసుదేవ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి, పేద ప్రజలకు ఇబ్బందిగా మార్చే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమంలో మేము సైతం అంటూ గ్రామ గ్రామాన ఉపాధి హామీ కూలీలతో ముచ్చటించి వారికి మేము అండగా ఉంటామని తెలుపుతూ మహాత్మా గాంధీ ఉపాధి చట్టం మార్పును ఎట్టి పరిస్థితుల్లో మేము సహించేది లేదని, అందుకు ఉపాధి హామీ కూలీలతో సంతకాల సేకరణ చేపట్టడం జరుగుతుందని, మోడీ సర్కార్ మొండిగా వ్యవహరించి పేద ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా కార్యక్రమాలను తీసుకురావద్దని గతంలో ఉన్న మాదిరిగానే మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం కొనసాగించాలని డిమాండ్ చేశారు, అనంతరం కొక్కొండ గ్రామ సర్పంచ్ ఆశెల్లి విజేత వాసుదేవ్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేద ప్రజల కళ్ళలో ఆనందం, నెలకొన్నదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దశలవారీగా నెరవేరుస్తూ ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ పార్టీకి అందరూ అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ పుట్టి విక్రమ్, మురాడి ప్రభాకర్, తలారి మల్లేష్, కె భాలేష్, రవి, యం ప్రసాద్, మరియు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మురాడి యాదయ్య, దమ్మని సత్తయ్య, తలారి ప్రవీణ్, పాండు, మరియు ఉపాధి కూలీలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు వంగ రాజేశ్వర్ రెడ్డి పరామర్శ



సిద్దిపేట, ఏప్రిల్ 09(భారత శక్తి) : సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఓబులాపూర్ గ్రామానికి చెందిన నక్క చరణ్ అకాల మరణం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి గురువారం మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్న వయసులోనే చరణ్ మృతి చెందడం ఎంతో దురదృష్టకరమన్నారు. తన వంతుగా రూ.10,000 ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అంతక ముందు నంగునూరు మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన గోవిందారం మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి గురువారం మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.